


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


భాగ్యరాజ్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు:




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 172 | ఆదివారం 28- 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ...

- సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ
- 194 ఏళ్ల 'జొనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్‌కు సందర్శన
- పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని
- భారత్-సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన

2లో



## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

- బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు
- అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2లో



## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

- ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి
- తెలంగాణ హక్కులుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు
- మరోమారు విమర్శలు గుప్పించిన హరీష్ రావు

ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు

మిగతా2లో



# సంక్షేమంతో పాటు... అభివృద్ధి కూడా ముఖ్యమే

- కేవలం సంక్షేమంతో అభివృద్ధిని సాధించలేం
- రోడ్లు, ఆస్పత్రులు, స్కూళ్లను అభివృద్ధి చేయాలి
- కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు
- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే చేస్తున్నాం
- కేవలం బటన్ నొక్కితే వైకాపా గతేమయ్యిందో చూశాం
- అభివృద్ధిపై గ్రామస్థాయిలో జనసేన ఆధ్వర్యంలో చర్చ సాగాలి
- వైకాపా కులరాజకీయాలతో భ్రష్టు పట్టించే యత్నం
- 11 సీట్లు వచ్చినా తిట్ల దండకం ఆపని వైకాపా నేతలు
- జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్

మిగతా2లో

ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారధుల సమాచార



## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

- గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి
- రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన
- ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం

2లో




రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు.

## అమరావతి రైతులను పరామర్శించేందుకు వెళ్లారా లేక రౌడీయిజం చేసేందుకు వెళ్లారా?

- వైసీపీ నేతలను అడ్డుకున్న అమరావతి రైతులు
- అమరావతిలో అడుగుపెట్టే అర్హత వైసీపీ నేతలకు లేదన్న అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్నది భూములిచ్చిన రైతులేనని వెల్లడి

2లో



## ఏపీకి తమిళనాడు సీఎం విజయ్?..

కాకినాడ హోర్డింగ్ వెనుక అసలు కథేంటి?




## భాగ్యరాజ్ ఆత్మకు శాంతి చేకూరాలి: జగన్

గుండెపోటుతో మృతి చెందిన దర్శకనటుడు భాగ్యరాజ్

సినీ రంగంపై భాగ్యరాజ్ చెరగని ముద్ర వేశారన్న జగన్



## నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

- భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది
- తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం
- కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు
- గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం
- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు
- నిర్వాసిత రైతులతె సిఎం చంద్రబాబు భేటీ

మిగతా 2లో





నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ..

## అయోధ్య విరాళాల వివాదం..

మోదీ మౌనాన్ని ప్రశ్నించిన ప్రియాంక్ ఖర్గే



- అయోధ్య విరాళాల వివాదంపై 'మన్ కీ బాత్'లో మోదీ మాట్లాడాలన్న ప్రియాంక్ ఖర్గే
- భక్తుల మనోభావాలతో బీజేపీ ఆడుకుంటోందని విమర్శలు
- సిట్ దర్యాప్తులో 8 మంది అరెస్ట్, రూ. 80 లక్షల నగదు స్వాధీనం

2లో

# సంక్షేమంతో పాటు...అభివృద్ధి కూడా ముఖ్యమే

సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించ నని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని పవన్ సూచించారు. గాదె సాయికృష్ణ వివాదంపై పవన్ కల్యాణ్ స్పందించారు. కృష్ణలంకలో ఒక గొడవ జరిగితే క్రిమినల్‌కు కులాన్ని ఎలా అంటగడుతున్నారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా.. ఏ కులం వారు చేసినా.. తప్పే కదా అని నిలదీశారు. కాపు అయితే ఒప్పు.. ఇంకొకరు అయితే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. తనకు పేపర్లు, ఛానళ్లు లేవని.. జనసైనికులే తన మీడియా అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలను సమానంగా చూడటమే సామాజిక న్యాయమని తెలిపారు. కుల రాజకీయం పొలిటికల్ విక్టరీ అవుతుందేమో గానీ.. సామాజిక విక్టరీ కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడూ జగన్ అండ్ కో చేతిలోనే ఉండాలా అని ప్రశ్నించారు. వైసీపీ వాళ్లను చూడాలి.. ప్రతి అంశంలోనూ కులాన్ని, మతాన్ని కూడా వాడతారని ఎద్దేవా చేశారు. వైసీపీలో పనిచేసిన నాయకులు మన వేదిక మీద ఉన్నారని ప్రస్తావించారు. వీరు దిగజారి మాట్లాడిన దాఖలాలు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. వైసీపీలో ఇతర నేతలు నోరు తెరిస్తే అసభ్య వ్యాఖ్యలే చేస్తారని.. వ్యక్తిత్వ హననాలు చేస్తారని చెప్పుకొచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ మనిషి.. ఆయన విలువలతో మాట్లాడారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 18వేల మంది సాధక్‌లను కలవాలనేది తన భావన అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ప్రతి ఊరిలో బాధ్యతలు అప్పగించిన నాయకుడు.. అక్కడ 2వేల మంది ప్రజలకు తెలిసి ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబును అరకుకు పంపించామని.. ఆయన జనాలతో మాట్లాడతారని.. ప్రకృతిని సంరక్షిస్తారని అన్నారు. పల్నాడుకు బాలినేని శ్రీనివాసరెడ్డి కరెక్టు అని భావించి.. ఆ బాధ్యత అప్పగించామని చెప్పారు. కాకినాడను తట్టుకోవాలంటే.. సామినేని ఉదయభాను కరెక్టు అని భావించామని తెలిపారు. మంత్రి కందుల దుర్గేశ్‌ని అమలాపురం పంపితే బంధువులు ఎక్కువ అని అన్నారని చెప్పారు. మొహమాటానికెళ్లి.. ఎవరినైనా పెట్టాల్సి వస్తుందేమేనని ఆయన అన్నారని చెప్పారు. కానీ ఈ విషయంలో పని చేసే వారికే ప్రాధాన్యం అనేది ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. 'పుష్కర కాలం పాటు మీరంతా నలిగారని.. మీరు ఏపని చేస్తున్నారో కాదు.. దేశానికి సేవ చేసే వారిని ప్రోత్సహిస్తా' అని స్పష్టం చేశారు. తనకు దేశం తర్వాతే ఏదైనా.. కులం అనేది సోషల్ రియాలిటీ అని చెప్పుకొచ్చారు. తాను ఈ విషయాన్ని మార్చాలనో, సరిదిద్దాలనో ప్రయత్నం చేయనని పేర్కొన్నారు. తాను కులాల గురించి మాట్లాడతానని కొంతమంది అంటారని.. తాను కులం కార్డు తీసుకుని ఎప్పుడూ పాలిటిక్స్ చేయనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రం బాగుండాలని, దేశం బాగుండాలని.. మానవత్వం ఉండాలనేదే తన ఆలోచన అని వ్యాఖ్యానించారు. కులం ఎప్పుడూ ఇంటి గడప లోపలే ఆగిపోవాలని.. గడప దాటాకా మన సంస్కృతి, ధర్మాలు ఉండాలని సూచించారు. ఇంకో పది అడుగులు వేస్తే.. దేశం, మానవత్వం గుర్తుకు రావాలని తెలిపారు. స్థాయికి దిగజారి మాట్లాడే వారికి కూడా కౌంటర్‌గా తాను మాట్లాడాల్సి వస్తుందని అన్నారు. క్షేత్రస్థాయిలోకి మీరంతా ఓ మెసేజ్ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ కాకుండా పిల్లలు అందరికీ ఒకే హాస్టల్ ఉండాలనేది తన కోరిక అని ఉద్ఘాటించారు. ఆయా ప్రభుత్వాలే దశాబ్దాలుగా ఈ కులాల పేరుతో పిల్లలను విడదీస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఓట్ల కోసం ప్రజల్లోకి వెళ్తే.. ఇటు దళితులు, అటు కాపులు, ఈ రోడ్డులో బీసీలు అంటూ విడగొట్టి మాట్లాడతారని అన్నారు. రాజకీయం ఇలానే నడుస్తుందనేది తనకు తెలియదని.. తనకు కులాల ఐక్యత ముఖ్యమని స్పష్టం చేశారు. కులం ఐడెంటిటీని తాను మార్చలేనని... లింగమనేని రమేశ్‌కు రాజ్యసభ ఇస్తే.. ఆ కులం మీద కొంతమంది చర్చ, రచ్చ చేశారని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు.

శివ లాగానే రమేశ్‌ని గుర్తించి.. ఆయన పడిన కష్టానికి తాను బాధ్యతలు అప్పగించానని అన్నారు. కొవైసీపీ పొలిటకల్ గేమ్ కోసం తన మీద విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఇన్ని బలమైన కులాలు ఉండి అధికారంలోకి ఎందుకు రాలేకపోతు న్నాయని ప్రశ్నించారు. బీసీ సామాజిక వర్గాలు 105 కులాలు ఉంటే.. కాపుల్లో బలిజ, ఒంటరి, తెగలు ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకు అధికారం కోసం తాను పని చేయలేదని.. అవకాశాలు అడిగే స్థాయిలోనే ఉన్నానని తెలిపారు. యాభై శాతం బీసీ కులాలు ఉన్నవారంతా కలెక్టివ్‌గా ఉండి అధికారం సాధించుకోవచ్చు కదా అని చెప్పారు. గొడవలు అప్పుడు మాత్రం అందరూ ఏకం అవుతున్నారని అన్నారు. ఓట్ల సమయంలో మాత్రం ముక్కలుగా విడిపోయి వేరే వారికి అవకాశం ఇస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

నీళ్లు లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు. 1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ.900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ.300 కోట్లు మొదటి విడతలో నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ధి చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు. మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్ధాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్-2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ.3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్-1, ఫేజ్-2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నే, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ.98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్-2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వం, రూ.60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు. రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తున్నామని.. మైక్రో ఇరిగేషన్‌కు మళ్లీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. హంద్రీ-నీవా పూర్తి చేసి చివరి ప్రాంతాలకు నీళ్లు అందించామని వెల్లడించారు. పోలవరం ఆలస్యం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. అమరావతిని నిలిపివేయడం రాష్ట్రానికి నష్టమన్నారు. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి రాజధాని అత్యంత కీలకమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామ న్నారు. కులం, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే మార్కాపురం అభివృద్ధి జరిగిందని చంద్రబాబు తెలిపారు. తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతులతో నీటి వృథాను అడ్డుకున్నామన్నారు. 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి ముగ్గురు ముఖ్యమంత్రులం జాతికి అంకితం చేశామని తెలిపారు. గంగా, కావేరి నదుల అనుసంధానం అవసరమన్నారు. దేశంలో విద్యుత్ గ్రిడ్ వ్యవస్థతో విద్యుత్ కొరత సమస్య తగ్గిందని చెప్పారు. సెల్‌ఫోన్ విప్లవం వల్ల ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. రైతుల్లో అభివృద్ధి దిశగా ఆలోచనా విధానం మారాలని సూచించారు. 2027 కల్లా పోలవరం పూర్తి చేస్తామని ప్రకటించారు. అక్కడి నుంచి నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకువస్తామన్నారు. అవసరమైతే నల్లమల సాగర్ నుంచి లిఫ్ట్ పెట్టి కావేరికి కూడా నీళ్లు ఇవ్వొచ్చన్నారు. దీని వలన ఐదు నదులు అనుసంధానం అవుతాయని.. నాలుగు రాష్ట్రాలు బాగుపడ తాయని చెప్పుకొచ్చారు.

'మార్కాపురం జిల్లా అభివృద్ధి చేసే బాధ్యత నాది. మీ కంటికి కనిపించే నాయకుల్ని చూడొద్దు.. నన్ను చూడండి, పార్టీని చూడండి , ఎన్డీయే కూటమిని చూడండి. మీ ఆమోదం లేకపోతే ఎవరినీ నేను ఆమోదించను. అందరూ ఆమోదించే వ్యక్తి దొరకడం కూడా కష్టమే. పోలవరం నిర్వాసితులు త్యాగం చేశారు. అందుకే ఒకే నియోజకవర్గానికి ఒక జిల్లా ఇచ్చాను. వెలిగొండ ప్రాజెక్టు రైతులు రాష్ట్రానికి ఆదర్శం' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## అమరావతి రైతులను పరామర్శించేందుకు వెళ్లారా లేక రౌడీయిజం చేసేందుకు వెళ్లారా?

ఉండవల్లిలో వైసీపీ నేతల (పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్) పర్యటన సందర్భంగా జరిగిన రాళ్లదాడిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అమరావతిలో అడుగుపెట్టే కనీస అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. వారు రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రౌడీయిజం చేయడానికా అని ప్రశ్నిస్తూ... వారి వెంట ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారో పోలీసుల వద్ద పక్కా లిస్ట్ ఉందని చెప్పారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారు కూడా వైసీపీ నేతల వెంట వచ్చారని... విజువల్స్ లో అందరూ ఉన్నారని తెలిపారు. వైసీపీ నేతలకు వ్యతిరేకంగా అక్కడ నిరసన తెలిపిన వారిలో 90 శాతం మంది రాజధాని కోసం భూములిచ్చిన అసలైన రైతులేనని స్పష్టం చేశారు. వైసీపీ అధినేత జగన్ గతంలో అమరావతిని అంగీకరించి, ఆ తర్వాత మూడు రాజధానుల డ్రామాలతో ఐదేళ్లు నరకం చూపించారని మండిపడ్డారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అమరావతి రైతుల వద్దకు వస్తున్నారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే వైసీపీకి మనుగడ ఉండదనే ఈ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అహర్నిశలు కష్టపడుతూ 2027 నాటికి అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే టార్గెట్‌గా పెట్టుకుందన్నారు.

## అయోధ్య విరాళాల వివాదం..

అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారంటూ కర్ణాటక హోం మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే తప్పుబట్టారు. ఈ అంశంపై ప్రధాని తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పష్టత ఇవ్వాలని శనివారం ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురి అరెస్టులు జరగడం, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక సభ్యులు రాజీనామా చేయడంతో ఈ వివాదం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది.

విరాళాల సేకరణలో కోట్లాది రూపాయల అవకతవకలు జరిగాయని ఈ నెల ప్రారంభంలో సమాజ్‌వాదీ పార్టీ నేతలు ఆరోపించడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సిట్ సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారులు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ సహాయకుడు రామశంకర్ యాదవ్‌తో సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా అధికారులు సుమారు రూ. 80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు. సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు. భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷సజీల। ఆనీఇ-బీప।నిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ ప్రక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ అస్సలు ఒప్పుకోదని స్పష్టం చేశారు. గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది బీఆర్ఎస్సేనని చెప్పారు. పాలమూరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతున్నారని, తాగేందుకు మంచి నీళ్లు లేక పాలమూరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చెయ్యడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తి అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రి అయిన రేవంత్ రెడ్డి, తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావొద్దని హరీష్ రావు హితవు పలికారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆంధ్రప్రదేశ్ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోందని, కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తే లేదని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు, ఆటో-రిక్షాలు, ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్-సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు: జనసేన ఎమ్మెల్యే నానాజీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు!






**ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి**

**కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి లిఖితపూర్వక ఫిర్యాదు**

**నంది పత్రిక కర్నూలు** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అత్యంత అసభ్యకర, అవమానకర, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (అలియాస్ నానాజీ)పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన కర్నూలు నాల్గవ పట్టణ (ఫోర్త్ టౌన్) పోలీస్ స్టేషన్‌లో ఎస్పైకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు.వ్యక్తిగత దూషణలు.. సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు! ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ, జూన్ 21న నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే పంతం నానాజీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని టార్గెట్ చేస్తూ పరుష పదజాలంతో వ్యక్తిగత దూషణలకు దిగారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, అనంతరం ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియా) ఉద్దేశపూర్వకంగా, విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో ఉద్రిక్తతలు పెంచేందుకు కుట్ర పన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం:** బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సమాజంలో శత్రుత్వాన్ని, అశాంతిని రేకెత్తించేలా మాట్లాడటం దుర్మార్గమని కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు రాష్ట్ర శాంతిభద్రతలకు తీవ్ర భంగం కలిగించే ప్రమాదం ఉందన్నారు. భారతీయ న్యాయ సంహిత (దీఙా), 2023 నిబంధనల ప్రకారం సదరు ఎమ్మెల్యేతో పాటు, ఆ వివాదాస్పద వీడియోలను మరియు పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిపై కూడా తక్షణమే ఎఫ్ఐఆర్ (ఫీ×=) నమోదు చేయాలని, సమగ్ర విచారణ జరిపి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని పోలీసులను గట్టిగా డిమాండ్ చేశారు.

**భారీగా తరలివచ్చిన శ్రేణులు:** పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని కాటసానికి మద్దతుగా నిలిచారు.

## కడప రింగ్ రోడ్డు లోని పాలంపల్లి క్రాస్ వద్ద ఘటన..



**నంది ప్రతినిధి, జూన్ 26, వైయస్సార్ కడప జిల్లా..**ముగ్గురు మృతి, మరో ముగ్గురు గాయాలు..మృతులు తిరుపతి పట్టణం జీవకోనకు చెందిన హర్షవర్ధన్ (27) కిషోర్ (28) సన్నీ రెడ్డి (24) గా గుర్తింపు..తిరుపతి నుండి హైదరాబాద్ వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో ప్రమాదం..షిఫ్ట్ కార్ లో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందగా ఎర్టిగా కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డ వైనం. ట్రాఫిక్ పోలీసులు చెన్నూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది

# మంగళగిరిలోని సి కె కన్వెన్షన్ హాల్లో కీలక సమావేశం..

**నంది ప్రతినిధి, 26, వైయస్సార్ కడప జిల్లా.** 25 పార్లమెంట్ కమిటీలకు కాసేపట్లో పవన్ కళ్యాణ్ కీలక భేటీ.. పార్టీ బలోపేతవే లక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం. గత ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్ తో హిస్టారికల్ విక్టరీ కొట్టిన జనసేన పార్టీ బలోపేతపై దృష్టి సారించింది. కేవలం అధికారంలో భాగవనడమే కాకుండా పార్టీని క్షేత్రస్థాయి నుండి ఒక పవర్ఫుల్ ఫెడరగా మారుతి ఆపరేషన్ జనసేనని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేపట్టారు. జనసేన బలోపేతంపై అత్యంత ప్రతిష్టాత్మకమైన సమావేశాన్ని నేడు పవన్ నిర్వహించబోతున్నారు. కాసేపట్లో ఈ కీలక భేటీ ప్రారంభం కాబోతోంది. మంగళగిరి కన్వెన్షన్ హాల్ లో ఈ సమావేశం జరుగుతుంది పార్టీ సమాచార సేకర కమిటీలతో పాటు 25 టోర్నమెంట్ కమిటీల ప్రతినిధులతో పవన్ విడివిడిగా, ముఖాముఖిగా సమావేశమై లోతుగా చర్చలు జరపనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కమిటీల పనితీరు ఎలా ఉంది? గ్రౌండ్ లెవెల్ లో ఎలాంటి సమస్యలు ఉన్నాయి అనే విషయాలపై పవన్ నేరుగా సమీక్ష జరపనున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన లోకల్ ఈక్వేషన్, కూటమిలోని టిడిపి మరియు బీజేపీ నేతలతో క్షేత్రస్థాయి కార్యకర్త సంబంధం ఎలా ఉందని విషయాలపై జనసే నాని ఈద్ బ్యాచ్ తీసుకోనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో జనసేన ను బలోపేతం చేసే వ్యూహాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుని అవకాశీ ఉన్నట్లు తెలుస్తుంది.

# 25 పార్లమెంట్ కమిటీలతో కాసేపట్లో పవన్ కల్యాణ్ కీలక భేటీ.. పార్టీ బలోపేతమే లక్ష్యం

**మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో కీలక సమావేశం**

**కమిటీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం కానున్న పవన్**

**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం**



గత ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో హిస్టారికల్ విక్టరీ కొట్టిన జనసేన... పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. కేవలం అధికారంలో భాగమవడమే కాకుండా... పార్టీని క్షేత్ర స్థాయి నుండి ఒక పవర్‌ఫుల్ కేడర్‌గా మార్చే ఆపరేషన్‌ను జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టారు. జనసేన సంస్థాగత బలోపేతంపై అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సమావేశాన్ని నేడు పవన్ నిర్వహించబోతున్నారు. కాసేపట్లో ఈ కీలక భేటీ ప్రారంభం కాబోతోంది.మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం జరగనుంది. పార్టీ సమాచార సేకరణ కమిటీలతో పాటు 25 పార్లమెంట్ కమిటీల ప్రతినిధులతో పవన్ విడివిడిగా, ముఖాముఖిగా సమావేశమై లోతుగా చర్చలు జరపనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కమిటీల పనితీరు ఎలా ఉంది? గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నాయి? అనే విషయాలపై పవన్ నేరుగా సమీక్ష జరపనున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన లోకల్ ఈక్వేషన్స్, కూటమిలోని టీడీపీ-బీజేపీ నేతలతో క్షేత్రస్థాయి కార్యకర్తల సమన్వయం ఎలా ఉందనే విషయాలపై జనసేనాని ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో జనసేనను బలోపేతం చేసే వ్యూహాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి..

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తన తో జీవించాలని**

**రౌడీ షీటర్లకు స్ట్రాంగ్ కౌన్సిలింగ్ ఇచ్చిన కడప వన్ టౌన్ సిఐ ఎం తిమ్మారెడ్డి..**



**నంది ప్రతినిధి, 26 వైయస్సార్ కడప జిల్లా క్రైమ్ న్యూస్.** జిల్లా ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్ ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, నీర చరిత్ర గల వారికి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో సి. ఐ ఎం తిమ్మారెడ్డి సాయంత్రం కౌన్సిలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి, స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్గొంటే తప్పనిసరిగా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కడప వన్ టౌన్ సీ. ఐ ఎం తిమ్మారెడ్డి వార్నింగ్ ఇవ్వడం జరిగింది.

# నిండు జీవితానిక రెండు చుక్కలు.

**ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.**

**ఎంపీడీఓ కార్యాలయం & వైద్య ఆరోగ్య శాఖ -- బేతంచెర్ల.**




**బేతంచెర్ల జూన్ 27 ( నందిపత్రిక )**బేతంచెర్ల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు మరియు పట్టణ ప్రాంతాలలో ఆదివారం (నేడే)పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించ బడుతుంది. ఈ సందర్భంగా మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో 5,020 మంది, పట్టణ ప్రాంతంలో 4,120 మంది, మొత్తం 9,140 మంది 05 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించ బడింది.ఈ కార్యక్రమ సమాచారం ప్రజలందరికీ తెలియజేసి,ప్రజలలో అవగాహన కల్పించి, ప్రతి అర్హత కలిగిన చిన్నారికి పోలియో చుక్కలు వేయించేందుకు సహకరించాలని ఎంపీడీఓ కార్యాలయం & వైద్య ఆరోగ్య శాఖ, బేతంచెర్ల వారు ప్రకటన ద్వారా తెలియ జేశారు.

## షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన నందవరం మోడల్ స్కూల్ విద్యార్థి



**మంత్రిపాడు జూన్ 27నంది పత్రిక** :విద్యార్థులలో ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డు కు నందవరం మోడల్ విద్యార్థి పెసల గోవర్ధన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థి గోవర్ధన్ అత్యున్నత ప్రతిభ కనబరిచి 593 మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యాడని,ఈనెల 29వ తేదీన మంగళగిరిలో విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నాడని,ఇది తమ పాఠశాలకు,ఉపాధ్యాయులకు ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేస్తూ గోవర్ధన్ కు అభినందనలు తెలియజేశారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**5 ఏళ్లలోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోవాలి**

**కర్నూలు నగరంలో 82,964 మంది చిన్నారుల కోసం 229 కేంద్రాలు**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో:** కర్నూలు నగరంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. నగర పరిధిలో 82,964 మంది 5 ఏళ్లలోపు చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని, వారి కోసం 229 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.పోలియో వ్యాధి చిన్నారుల్లో శాశ్వత వైకల్యానికి కారణమవుతుందని, అయితే పోలియో చుక్కలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి సారి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ముఖ్యమని తెలిపారు. గతంలో పోలియో టీకాలు వేయించినప్పటికీ, ఈ విడతలో కూడా తప్పనిసరిగా చుక్కలు వేయించాలని సూచించారు.ఎవరైనా బూత్‌లకు రాలేని పక్షంలో జూన్ 29, 30 తేదీల్లో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తాయని తెలిపారు. నగరంలోని ప్రతి చిన్నారి పోలియో చుక్కలు పొందేలా తల్లిదండ్రులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

## ఎంపీ అవినాష్ రెడ్డి నిధులతో కృపానగర్ ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులకు శ్రీకారం: ఎంపీటీసీ రవికుమార్



**పోరుమామిళ్ల జూన్ 27: (నంది పత్రిక ):**వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కల్‌రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని కృపానగర్ ఎస్సీ కాలనీలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఎంపీ అవినాష్ రెడ్డి నిధుల నుంచి రూ.3 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఈరోజు ఘనంగా శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాయపాటి రవికుమార్, ఇంజినీర్ అసిస్టెంట్ శివశంకర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం దొరకడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు మరియు అధికారులు కలిసి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారుల సేవా దృక్పథం వల్ల గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

## మహాత్మా జ్యోతి రావు పూలే స్కూల్ విద్యార్థులపై జాగ్రత్తలు తీసుకోవాలి.

**బేతంచెర్ల సిఐ వెంకటేశ్వర రావు.**



**బేతంచెర్ల జూన్ 27 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం గొరుమానుకొండ గ్రామ పరిధిలోగల మహాత్మా జ్యోతి రావు పూలే స్కూల్ హాస్టల్ నుండి శనివారం ఉదయం 7 గంటల సమయంలో స్కూల్, హాస్టల్ నుండి 5 వతరగతి చదువుతున్న వంకదారి వరుణ్, వయసు10 సంవత్సరాలు (తండ్రిపేరు చంద్ర శేఖర్ కల్వటాల గ్రామం కొలిమిగుండ్ల మండలం) మరియు శ్రీరాముల సందీప్ కుమార్, వయసు 10 సం వత్సరములు (తండ్రి పేరు యువరాజు ఆకుమల్ల గ్రామం సంజామల మండలం ) అను ఇద్దరు అబ్బాయిలు వారము రోజుల క్రితం ఎంజేపీ స్కూల్ లో 5 వ తరగతి చేరినారని, తల్లిదండ్రులు మీద బెంగ పెట్టుకుని శనివారం ఉదయం గోడ దూకి పోవుతుండగా, వచ్చిన సమాచారంతో వారిరువురిని బేతంచెర్ల పోలీసులు, పోలీస్ స్టేషన్ కు తీసుకుని వచ్చి, తల్లిదండ్రులను మరియు టీచర్ లను పిలిపించి, కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించడమైనది. మహాత్మా జ్యోతిబా పూలే స్కూల్ ప్రిన్సిపాల్ తో మాట్లాడి, మరలా ఇలాంటి సంఘటనలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవలసిందిగా బేతంచెర్ల సిఐ. వెంకటేశ్వర రావు చెప్పడమైనది.

## నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం

**రాత్రి వేళల్లో కొనసాగుతున్న - విజిబుల్ పోలీసింగ్**

**రహదారి ప్రమాదాల నివారణకు “స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో” కార్యక్రమం**

**కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ‘విజిబుల్ పోలీసింగ్’ కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా నేరాల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై తనిఖీలు నిర్వహిస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నారు.కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.కర్నూలు నగరంలో బ్లూ కోల్ట్స్, క్యూఆర్టీ పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కూడా చేపట్టారు. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు “స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో” కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## ప్రతి ఒక్కరు యస్ ఐ ఆర్ ను వినియోగించుకోవాలి బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ కోడుమూరు రూరల్ మండలం బాలాజీనగర్ 100 నెంబర్ బూతు నందు బిజెపి నాయకులు వేల్పుల గోపాల్ మాట్లాడుతూ యస్ ఐ ఆర్ గురించి అపోహలు వీడి ప్రతి ఒక్క ప్రజా ఓటరు సద్వినియోగం చేసుకొని సచివాలయం అధికారులతో మరియు కూటమి నాయకులకు సహకరించాలని అన్నారు మన దేశంలో బెంగాల్ మధ్యప్రదేశ్ ఛత్తీస్గఢ్ కేరళ రాష్ట్రలలో నకిలీ ఓటర్లను సరియైన ఆధారాలు ఇవ్వని ఓటర్లు తొలగించి అక్రమంగా నివసిస్తున్నా వారందరికీ ఇది తగిన మార్గం యస్ ఐ ఆర్ కనుక ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు సుమలత బెస్త ఈరన్న ఈరన్నగౌడ్ లవన్ గౌడ్ శివరామ్ భాష తిరుమలేష్ కిషోర్ మరియు కూటమి నాయకులు తదితర నాయకులు పాల్గొన్నారు.



# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:






## జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

## ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు జిల్లాలో జూన్ 28 నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని జెండా ఊపి జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో జూన్ 28, 29, 30 తేదీలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28న జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించి, జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. జిల్లాలో మొత్తం 3,52,164 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, వారందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 1,630 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ జూన్ 28న తమ సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు ఐదేళ్లలోపు పిల్లలను తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, అందరి సహకారంతో జిల్లాను పూర్తిస్థాయి పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు భారీ పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ జాయింట్ కలెక్టర్, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఎంహెచ్వో డాక్టర్ భాస్కర్, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు వద్దే డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**ఓటర్లు ఫోటోలు, వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలి**

**ఎస్ఐఆర్ ప్రక్రియ సులువుగా, వేగంగా పూర్తి చేసేందుకు సహకరించాలి**

**రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలి**

**బిఎల్వోలతో ప్రతిరోజూ బిఎల్ఏలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి**

**కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఓటరు వద్దకు వెళ్లినప్పుడే పూర్తిస్థాయిలో ముగించాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను సైతం అక్కడికక్కడే పూర్తి చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. శనివారం బిఎల్వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఈఆర్వో, ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించి, డిజిటలైజేషన్ వేగవంతానికి దిశానిర్దేశం చేశారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

**ఓటర్లకు సూచనలు:** ఇంటింటికి బిఎల్వో వచ్చినప్పుడు రెండు హాఫ్‌సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఓటరు లేదా వారి తల్లిదండ్రులు, అవ్వ, తాతలు, నాన్నమ్మ, జేజి నాన్నమ్మల్లో ఎవరైనా 2002 సంవత్సరంలో రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, పార్ట్ నంబర్‌లలో ఎక్కడ నమోదై ఉన్నారో సంబంధించిన వివరాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఓట్లను తొలగిస్తున్నారనే పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి సమర్పిస్తే డ్రాఫ్ట్ ముసాయిదాలో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందని పక్షంలో బిఎల్వోను సంప్రదించాలని, అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ పార్టీలకు సూచనలు:ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించే సమయంలో తప్పనిసరిగా బిఎల్ఏలను పంపించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పూరింపు ప్రక్రియల్లో బిఎల్ఏలు చురుకుగా పాల్గొనాలని, తద్వారా ఫారాల డిజిటలైజేషన్‌ను సకాలంలో పూర్తి చేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఆర్వోలు తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, మేనేజర్ జునైద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరు మండలంలో ఆ నాలుగు గంటలు నరకం

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 27 :** ఒకటి కాదు... రెండు కాదు.... ఏకంగా నాలుగు గంటలు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడంతో వినియోగదారులు నరకాన్ని చవిచూశారు. ఓవర్ లోడ్ పేరుతో విద్యుత్ శాఖ పల్లె ప్రాంతాలలో సరఫరాను నిలిపివేస్తూ ఉండటంతో ప్రజలు ఆ శాఖపై అక్కసు వెళ్ళబోస్తున్నారు. బండి ఆత్మకూరు మండలంలో శుక్రవారం రాత్రి 10 గంటల నుండి శనివారం తెల్లవారుజామున రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మెయిన్ సప్లై పేరుతో సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ట్రాన్స్కో అధికారులు సాకు చెబుతున్నారు. నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో వినియోగదారులు ఉక్కపోతతో దోమలతో సహవాసం చేశారు. బండి ఆత్మకూరు మండలంలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడినప్పటికీ, నంద్యాలలో మాత్రం సరఫరాలో అంతరాయం లేకపోవడంతో విద్యుత్ అధికారులు హాయిగా కునుకు తీశారు. పట్టణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఇచ్చి, పల్లె ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంలో అధికారులు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని విద్యుత్ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంత వాసులే ప్రజలా? పల్లె ప్రాంతాలలో నివసిస్తున్న వారు ప్రజలు కారా? అంటూ వినియోగదారు ప్రశ్నిస్తున్నారు. అందరి మాదిరిగానే పల్లె ప్రాంతాల ప్రజలు ప్రతినెల విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నప్పుడు సరఫరాను నిలిపివేయడంలో అధికారులు పక్షపాత ధోరణి ని అవలంబిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంటా గంటన్నర అయితే పర్వాలేదు... ఏకంగా నాలుగు గంటల పాటు మెయిన్ సప్లై పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**మరమ్మతుల పేరుతో సరఫరా నిలిపివేత**

మరమ్మతుల పేరుతో విద్యుత్ శాఖ అధికారులు గత నాలుగు రోజుల నుండి బండి ఆత్మకూరులో అర్ధాంతరంగా సరఫరాను నిలిపివేస్తున్నారు. ఈ విషయంలో వినియోగదారులకు విద్యుత్ శాఖకు చెందిన అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వడం లేదు. విద్యుత్ సరఫరా నిలిచిపోయేందుకు ఆ శాఖ అధికారులు కారణభూతులవుతున్నారు. చిన్నచిన్న వర్షాలకే, గాలి వానలకు విద్యుత్ స్తంభాలు విరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల నేల వారితో ఉన్నాయి. స్తంభాలను ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ



అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఘాటుగా విమర్శిస్తున్నారు. స్తంభాలను ఏర్పాటు చేయడంలో సరియైన ప్రమాణాలను పాటించకపోవడం వల్ల, విద్యుత్ స్తంభాలు నేలకు ఒరుగుతూ ఉన్నాయి. నాణ్యతలేని స్తంభాలను ఏర్పాటు చేస్తూ ఉండటం వల్ల, చిన్నపాటి గాలికే స్తంభాలు మధ్యలో విరిగిపోతున్నాయి.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

**తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్.**



**బద్వేల్ జూన్ 27: (నంది పత్రిక)**ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు. బద్వేల్ మండలంలోని, తొట్టిగారి పల్లెలో శనివారం పల్స్ పోలియో ప్రోగ్రామ్ మైక్ అనౌన్స్మెంట్ కార్యక్రమాన్ని రాజేష్ కుమార్ ప్రారంభించారు. వ్యాక్సిన్ క్యారియర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ, మండలంలో ఏడు రూట్లల్లో పల్స్ పోలియో బూతులను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు 5424 మంది పిల్లలు పల్స్ పోలియో చుక్కలను వేయనున్నట్లు ఆయన తెలిపారు. పల్స్ పోలియో చుక్కలను వేయించుకోవాలని, విద్యార్థులతో ర్యాలీని చేయించి ,పిల్లల తల్లిదండ్రులకు తెలియపరచడం జరిగిందన్నారు .మొదటి రోజు బూతులలో ,రెండు, మూడవ రోజులలో సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, మిగిలి ఉన్న పిల్లలకు చుక్కలను వేయించనున్నట్లు వైద్యాధికారి శశివర్ధన్ రెడ్డి అన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య మాట్లాడుతూ, రాబోయే రోజులలో ప్రతి పిల్లవాడు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండి, పోలియో లేని ప్రాంతంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చంద్రావతి ,డి పి ఎం ఓ శంభూ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, ఏఎన్ఎంలు ,ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యల పరిష్కారానికై జూన్ 30న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం**

**రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్**



**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా రైతుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న అధికార కూటమి ప్రభుత్వానికి ఒత్తిడి తెచ్చే విధంగా ఖరీఫ్ రైతుల కౌ లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూన్ 30న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు

**రైతుల డిమాండ్లు** 1 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలో కూడా రైతులందరికీ రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలి 2 అన్నదాత సుఖీభవ పథకాన్ని 20 వేల రూపాయల నుండి 50 వేల రూపాయల వరకు పెంచాలి 3 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి 4 ఆరుగాలం శ్రమించే 50 సంవత్సరాల పైబడిన రైతన్నలకు నెలకు పదివేల రూపాయలు చొప్పున పెన్షన్ ఇవ్వాలి 5 ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు గత మూడు సంవత్సరాలుగా పంటల భీమా పరిహారం బకాయిలు సుమారు 4400 కోట్లు వెంటనే చెల్లించాలి మరియు రైతులందరికీ ఉచిత పంటల భీమా పథకాన్ని పునరుద్ధరించాలి 6 రెండేళ్ల కాలంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీ బకాయిలు 1200 కోట్లు తక్షణమే విడుదల చేయాలి 7 ఆర్బిఐ నిబంధనల ప్రకారం ఎలాంటి పూచి కత్తు లేకుండా కౌ లు రైతులందరికీ రెండు లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలి 8 పెరిగిన రసాయనిక ఎరువుల ధరలు క్రిమిసంహారక మందుల ధరలు తగ్గించాలి 9 వ్యవసాయ రంగానికి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అనుసరించి సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలి 10 కౌ లు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి 11 కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి రైతులకు పంట రుణాలకువడ్డీ రాయితీ 500 కోట్ల బకాయిలు ఇవ్వాలిపైన తెలిపిన డిమాండ్ల సాధన కోసం ధర్నా చేపడుతున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునెప్ప కర్నూల్ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి సహాయ కార్యదర్శి చింతల మహేష్ రైతు సంగం సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు కల్లూరు మండలం రైతు సంఘం కార్యదర్శి రాముడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 28న ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించండి కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** జూన్ 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆదికృష్ణమ్మపిలుపునిచ్చారు. ఐదేళ్ల లోపు ఉన్న ప్రతి చిన్నారికి సమీపంలోని పోలియో కేంద్రంలో తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని ఆమె కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పిల్లలకు సాధారణ టీకాలు వేయించినప్పటికీ పల్స్ పోలియో కార్యక్రమంలో ఇచ్చే పోలియో చుక్కలు కూడా తప్పనిసరిగా వేయించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన అన్ని పోలియో కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ చిన్నారులను తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. “నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు“ అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేస్తూ, జూన్ 28న ఐదేళ్ల లోపు ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా వ్యవహరించాలని గుడిసె ఆది కృష్ణమ్మ కోరారు.



# ఏపీ ఎయిర్‌పోర్టుల్లో మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్..

ఆంధ్రప్రదేశ్‌లోని విమానాశ్రయాల్లో మద్యం అమ్మకాలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఎయిర్‌పోర్టుల ప్రాంగణాల్లో బార్లు, వైన్ షాపులు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలోని విమానాశ్రయానికి ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, విమానాశ్రయాల్లోని బార్లు, వైన్ షాపులు 24 గంటలూ పనిచేసేందుకు అనుమతి కల్పించారు. ఈ కొత్త విధానంలో భాగంగా ప్రభుత్వం లైసెన్స్ ఫీజులు, ఎక్సైజ్ సుంకాన్ని కూడా ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టులో బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, వైన్ షాపు కోసం దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఇక ఎక్సైజ్ సుంకం విషయానికొస్తే, విమానాశ్రయంలోని వైన్ షాపుకు ఏటా రూ.2 కోట్లుగా నిర్ణయించారు. బార్లకు ప్రయాణికుల రద్దీ ఆధారంగా ఎక్సైజ్ సుంకాన్ని రెండు రకాలుగా విభజించారు. ఏడాదికి 20 లక్షలకు పైగా ప్రయాణికుల రాకపోకలు ఉన్న విమానాశ్రయాల్లోని బార్లకు రూ.25 లక్షలు, 20 లక్షల లోపు ప్రయాణికులు ఉన్నచోట రూ.15 లక్షలుగా ఎక్సైజ్ సుంకాన్ని నిర్ధారించారు. ఈ కొత్త ఎక్సైజ్ విధానాన్ని మూడేళ్ల తర్వాత సమీక్షించనున్నట్లు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# 2 ఏళ్ళ కూటమి ప్రభుత్వ ప్రస్థానం - విధ్వంసం నుంచి వికాసం వైపు - సంక్షోభం నుంచి స్వరాంధ్ర వైపు - జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు యాదవ్

**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త చరిత్రను లిఖిస్తూ 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన పూర్తి చేసుకుంది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఇది ప్రజల ప్రభుత్వం.. ప్రగతి ప్రభువం అనే ముద్రతో ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం గెలిపించిందని, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సంధర్బంగా రాష్ట్ర మంత్రివరులు టి.జి.భరత్ అధ్యక్షన కర్నూలు నగరంలోని మౌర్యా ఇన్ నందు జరిగిన కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు యాదవ్ మాట్లాడటం జరిగింది. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు పూర్తిగా నాశనమయ్యాయని, రాష్ట్రం తీవ్ర సంక్షోభ పరిస్తితుల్లో ఉన్న సమయంలొ తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజేపి మూడు శక్తులు ఏకమై రాష్ట్ర పునర్మినాణానికి శ్రీకారం చుట్టాయని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభ్రివృద్ధి వంటి అన్ని రంగాల్లో వేగంగ ముందుకు సాగుతుందని అన్నారు.రాష్ట్ర మంత్రివర్యులు టి.జి.భరత్ కర్నూలు నగరంలోని 32 వార్డులలొ రూ. 150 నుంచి 200 కొట్లు ఖర్చు చేశారని అన్నారు. తన వార్డు యందు కమ్యూనిటి హాల్ నిర్మాణం కొరకు టి.జి.భరత్ ను సంప్రదించగా, వారు తన సొంత నిధులతో రూ 25 లక్షలతో కమ్యూనిటి హాల్ పూర్తి చేయిస్తున్నారని అన్నారు. యస్.వి.మోహన్ రెడ్డి పోలీసులను ఉద్దేశిస్తొ వారు టిడిపి కి తొత్తులు అని మాట్లాడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పోలీసులు టిడిపి కి పని చెస్తుంటే యస్.వి.మోహన్ రెడ్డి బయట తిరిగేవాడా అని అన్నారు. టి.జి.భరత్ ది ఇలాంటి స్వభావం కాదని తెలిపారు. 11 సీట్లను ప్రజలు వైసిపి కి ఇస్తే కి ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నిలల్లొ 42 వార్డులలో టిడిపి తప్పక గెలుస్తుందని అన్నారు.



2029 ఎన్నికల్లొ ఈ సారి టి.జి.భరత్ ని 40 వేల ఓట్ల మెజారిటి తో గెలిపిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా పార్టీ అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర పార్టీ అధ్యక్షులు కొరకంచి రవికుమార్, జన సేన జిల్ల అధ్యక్షులు చింతా సురేష్, అర్షద్, జకియా అక్సారి, కైప పద్మలతా రెడ్డి, రాజశేఖర రెడ్డి మొదలగు వారితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డా. రవిబాబు

**కడప, బ్యూరో చీఫ్ జూన్ 27 నంది పత్రిక** జిల్లాలో ఆదివారం (జూన్ 28) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రవిబాబు పిలుపునిచ్చారు. శనివారం తన కార్యాలయంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు 2,37,527 మంది చిన్నారులు పోలియో చుక్కలకు అర్హులుగా గుర్తించామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర హైరిస్క్ ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనే వైద్యాధికారులు, సూపర్వైజర్లు, వ్యాక్సినేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, అవసరమైన పోలియో వ్యాక్సిన్, బ్యానర్లు, ఇతర సామగ్రిని అన్ని ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశామని వెల్లడించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే పోలియో చుక్కల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు.

జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేసిన వివరాలను ఆధార్ లేదా ఏబీహెచ్ఏ (ఆభా) ఐడీ ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లల ఆధార్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.ఇప్పటికే పోలియో చుక్కలు వేసిన పిల్లలకు కూడా మళ్లీ చుక్కలు వేయించడం తప్పనిసరి అని తెలిపారు.





పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. "పోలియో నుంచి శాశ్వత రక్షణకు రెండు పోలియో చుక్కలే మార్గం" అని పేర్కొంటూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డీపీఎంఓ మహమ్మద్ తహర్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ ఆరెపుల్లా, డీఈఎంఓ భారతి, ఎస్‌వో రమేష్ రెడ్డి, సీహెచ్‌వో మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాల సమర్థ నిర్వహణతో ప్రజారోగ్య పరిరక్షణ





## ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ విధానాలు అవలంబించాలి

## నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూలు సిటీ నందిపత్రిక** పట్టణాల్లో ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. 'స్వచ్ఛాంధ్ర మిషన్'లో భాగంగా ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణపై కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన పట్టణాల సానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహించారు. సాహస్, వాష్ సంస్థల ప్రతినిధులతో కలిసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్2026 మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, వర్గీకరించడం, శుద్ధి చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. తడి, పొడి వ్యర్థాలను మూలం వద్దే వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం వంటి చర్యలు పరిశుభ్రమైన నగర నిర్మాణానికి దోహదపడతాయని వివరించారు. అలాగే వ్యర్థాల నిర్వహణలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణను పటిష్టంగా అమలు చేయడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని ఏర్పరచవచ్చని తెలిపారు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, బేతంచెర్ల కమిషనర్ హరిప్రసాద్, సాహస్ సంస్థ పీఎంయూ కోఆర్డినేటర్ అర్జున్ శర్మ, రిసోర్స్ పర్సన్స్ నీలిమా రెడ్డి, నర్మద, కోఆర్డినేటర్ జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి నగర్ వార్డు అభివృద్ధే మా లక్ష్యం



## మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ

## 72 లక్షల రూపాయలతో మాజీ కౌన్సిలర్ లలితమ్మ చేతుల మీదుగా భూమి పూజ

**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతి నగర్ కాలనీలో ఈరోజు 72 లక్షల రూపాయల వ్యయంతో మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ చేతుల మీదుగా శనివారంభూమి పూజ కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా లలితమ్మ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారి సహాయ సహకారాలతో గత తొమ్మిది నెలల కాలములో దాదాపు ఒక కోటి డెబ్బై లక్షల రూపాయల వ్యయముతో సిసి డ్రైనేజీలు, సిసి రోడ్లు మరియు మహిళలకోసం సామూహిక మరుగుదొడ్లు నిర్మాణాలు చేపట్టడం జరిగిందని లలితమ్మ వివరించారు.కనుక అమరావతి నగర్ వార్డు అభివృద్ధి చెందాలి అంటే ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారి అండదండలతో పాటుగా పెద్దాయన టిడిపి ఇంచార్జీ మీనాక్షీ నాయుడు గారు,జనసేన ఇంచార్జీ మల్లప్ప గారి ఆశీస్సులతో పోటీ చేసే కూటమి అభ్యర్థి ఎవరైనా సరే గెలిపించుకోవాలని అప్పుడే అమరావతి నగర్ వార్డు అభివృద్ధి చెందుతుందని కాదని పొరపాటున వైసిపి అభ్యర్థిని గెలిపించుకుంటే అమరావతి నగర్ కాలనీ అభివృద్ధిని గాలికి వదిలేసి ఎర్రిస్వామి ఇంటికి కాపలాదారుగా మిగిలిపోతాడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.గతములో ఈ వార్డులో గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు కూడా ఎర్రిస్వామి పెట్టే ఇబ్బందులు భరించలేకనే పార్టీలు మారారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.కనుక అమరావతి నగర్ వార్డు అభివృద్ధికోసం మంచిగా ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు వెల్లాల మధుసూధనశర్మ, పరుశురాం, చరణ్, తిక్కన్న , పవన్, రవి తిరుమల, రాజు, జంబన్న సాయి, చిన్న, రాజేష్ మొదలైన నాయకులు, మున్సిపల్ ఏఈ భువన చంద్రారెడ్డి,వలి, సచివాలయం సెక్రటరీ అపర్ణ, అధికారులు పెద్ద ఎత్తునఅ మహిళలు పాల్గొన్నారు.



# 'పద్ధతి మార్చుకోవాలి'

## అన్న క్యాంటీన్ పర్యవేక్షక యంత్రాంగంపై కమిషనర్ చల్లా ఓబులేసు అసహనం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూల్ నగరంలోని అన్న క్యాంటీన్‌లో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది సంఖ్యలో సగానికి పైగా లేకపోవడం ఏమిటి? పదేపదే చెప్పినా పద్ధతి మార్చుకోరా? అంటూ అన్న క్యాంటీన్ పర్యవేక్షక యంత్రాంగంపై నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అసహనం వ్యక్తం చేశారు. శనివారం పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో 7 మంది ఉండాల్సిన సిబ్బందిలో ముగ్గురు మాత్రమే ఉండటంతో, అన్న క్యాంటీన్ల పర్యవేక్షక యంత్రాంగానికి కమిషనర్ ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు హెచ్చరించినా ఎందుకు పద్ధతి మార్చుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధంగా ఉంటే అన్న క్యాంటీన్ సీఈఓకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అదేవిధంగా వై. జంక్షన్, బళ్లారి చౌరస్తా, సంతోష్ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడి వద్ద 8 డస్ట్‌బిన్‌లు తప్పనిసరిగా ఉండాలని, ప్రధాన రహదారులు, జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న వాణిజ్య దుకాణాల వద్ద బిన్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, జాప్యం చేస్తే రుసుము వసూలు చేసి బిన్‌లు అందజేయాలని సూచించారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆలీం బాషా, రవి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి..!

## ఏఈఆర్ఓలకు డీఆర్వో మల్లికార్జునుడు దిశానిర్దేశం



**కడప, బ్యూరో చీఫ్ జూన్ 27 నంది పత్రిక** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మల్లికార్జునుడు ఏఈఆర్ఓలకు సూచించారు.శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహణపై ఇటీవల ఎంపికచేసిన ఏఈఆర్ఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్వో మల్లికార్జునుడితో పాటు డిప్యూటీ కలెక్టర్లు హరిప్రసాద్, రంగస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి దశను ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్‌మరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలీకరణ ప్రక్రియను కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి భారత పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు చేరకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని, అవసరమైన చోట విచారణ నిర్వహించి తుది ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆధార్‌ను కేవలం గుర్తింపు పత్రంగానే పరిగణించాలని, జనన తేదీ లేదా నివాస ధ్రువీకరణకు అది ఆధారం కాదని ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వివరించారు. శిక్షణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, పత్రాల పరిశీలన, మ్యాపింగ్, నోటీసుల జారీ, విచారణలు, తుది ఓటరు జాబితా ప్రచురణ తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

# కూటమి ప్రభుత్వము పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి సిపిఎం..

**నంది పత్రిక ఆత్మకూరు..**పట్టణంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తికి ఇళ్ల స్థలాలు చూపించాలి :సిపిఎం ఆత్మకూర్ : పట్టణంలో దరఖాస్తు చేసిన ప్రతి వ్యక్తికి ఇళ్ల స్థలాలు చూపించాలని, పక్కా గృహాలు నిర్మించుకునేందుకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అర్హులైన వారికి పెన్షన్స్ ఇవ్వాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు డి. రామ్ నాయక్,సద్దాం హుస్సేన్, నాయకులు బీఎస్ వలి లు డిమాండ్ చేశారు. పట్టణంలోని అర్హులైన పేదలందరికీ స్థలాలు ఇవ్వాలని , పెన్షన్లు ఇవ్వాలని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మూడోరోజు పట్టణంలో పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ పాదయాత్ర వడ్డమాపురం వస్తాలో ప్రారంభమై తోటగిరి వాకటిపేట రాజా వీధి ఏబీఎన్ పాలెం ఎస్ పి జి పాలెం గొల్లపేట వడ్లపేట నీలి తొట్లు కొత్తపేట మీదుగా నంద్యాల రన్నింగ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యక్తికి అర్జీదారునికి ఇళ్ల స్థలాలు చూపించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇసుక, ఇనుము, సిమెంట్, ధరలు పెరగడం వలనఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని పేద మధ్యతరగతి కుటుంబాలు చిన్నచిన్న గదిలో నివాసం ఉంటూ ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం క్యాబినెట్లో ఇంటి స్థలాల పంపిణీ చేయడానికి అంగీకారం తెలిపింది అన్నారు. తక్షణమే ఇంటి స్థలాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి సర్వే చేయాలని అర్హుల జాబితాను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో 2001 2003లో దుద్యాల రోడ్డు, చక్రం హోటల్ వెనుక, మైనార్టీ కాలనీలో పట్టాలు వచ్చి నేటికీ స్థలాలు రానివారు అనేక మంది ఉన్నారని వారికి కూడా ఇళ్లస్థలాలు ఇవ్వాలని, జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు వచ్చి హైవేలో స్థలాలు కోల్పోయిన వారికి నేటికి స్థలాలు చూపించలేదని వారికి స్థలాలు చూపించాలని, ప్రభుత్వ స్థలాల్లో అనేక సంవత్సరాల నుంచి కాపురం ఉంటున్న పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల పరిష్కారానికి జూలై 2న మున్సిపల్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలో పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు వీరన్న నాయకులు నూర్,మహమ్మద్,చిన్న అంబయ్య, ప్రతాప్,, పరమేష్,వెంకటేశ్వర్లు, మహేష్, దర్గయ్య,సుబ్బయ్య,శేషన్న,చిన్న లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



# పంతం నానాజీ ఖబడ్దార్..





### జగన్న ఆదేశాలు ఇస్తే మా అడుగుల చప్పుడుకు నీ.. గుండె ఆగిపోతుంది ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాష...

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 27 ( నంది పత్రిక )**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి మాటల మంటలు రేగుతున్నాయి! వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై నంద్యాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిప్పులు చెరుగుతున్నాయి. పంతం నానాజీకి నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. "జగనన్న ఆదేశం ఇస్తే... మా అడుగుల చప్పుడుకే నీ గుండె ఆగిపోతుంది.. ఖబడ్దార్!" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహజం... కానీ విజ్ఞత మరచి, కోట్లాది మంది అభిమానించే ఒక ప్రజా నాయకుడిపై నోరుపారేసుకుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని నంద్యాల సాక్షిగా వైసీపీ నేతలు హెచ్చరించారు. జగనన్నను ఒక్క మాట అన్నా.. సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు! కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ.. జగన్ మోహన్ రెడ్డిపై చేసిన అసందర్భ, అనుచిత వ్యాఖ్యల పట్ల నంద్యాల లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల గుండెల్లో ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడ్డాయి! ఖబడ్దార్ నానాజీ అంటూ ఎమ్మెల్సీ ఇసాక్ బాష చేసిన హెచ్చరికలతో నంద్యాల రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. నాయకుడిపై ఉన్న గుండె నిండా అభిమానంతో, వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు... పంతం నానాజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. అక్కడ ఎస్ఐ కృష్ణారెడ్డికి నానాజీ అనుచిత వ్యాఖ్యలపై అధికారికంగా ఫిర్యాదు పత్రాలను అందజేశారు. చట్టం ముందు ఎవరైనా ఒకటేనని, జగనన్నపై విషం చిమ్మితే ఊరుకునేది లేదని ఖరాఖండిగా చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, వైసిపి రాష్ట్ర స్పాక్ పర్సన్ రవికుమార్,స్టేట్ ర్ సెల్ సెక్రటరీ ఆంజనేయులు, రాష్ట్ర ర్ సెల్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, వైసిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామ సుబ్బయ్య, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైసీపీ జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, జిల్లా వైసీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ,వైసీపీ జిల్లా సెక్రెటరీ దేవనగర్ భాష, వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టీవి రమణ వైసిపి అసెంబ్లీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, వైసిపి నంద్యాల అసెంబ్లీ ఎస్టి సెల్ అధ్యక్షుడు రామచంద్రుడు, వైసిపి నాయకులు సాయిరాం రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు చింత శ్రీనివాసులు, మేస చంద్ర శేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి వైసిపి జిల్లా అధ్యక్షుడు ఎస్ వి మోహన్ రెడ్డి



**కర్నూలు సిటీ నందిపత్రిక** మాజీ ముఖ్యమంత్రి వై . యస్ . జగన్ మోహన్ రెడ్డి పై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు, కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్ ఎస్వీ మోహన్ రెడ్డి కర్నూలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విలేకరుల సమావేశంలో చేసిన వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలను అనంతరం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో విద్వేషాలు, ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.భారతీయ న్యాయ సంహిత (బి యన్ యస్ ), 2023లోని సంబంధిత నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేతో పాటు ఆ వీడియోలు, పోస్టులను ప్రచారం చేసిన వారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య భద్రతే కూటమి ధ్యేయం... ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు..ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 8మంది లబ్దిదారులకు అందిన రూ. 9,46,557 విలువ గల చెక్కులను ఎం.పీ , పంచలింగాల గ్రామంలోని తన నివాసంలో పంపిణీ చేశారు.. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను త్వరితగతిన విడుదల చేస్తుందన్నారు..అర్హులైన ప్రతి ఒక్కరూ సీ.ఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు..ఈ కార్యక్రమంలో డి.సి.ఎం.ఎస్ చైర్మన్ నాగేశ్వర రావు యాదవ్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు...

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించాలి.



**రుద్రవరం ప్రతినిధి జూన్ 27 (నంది పత్రిక):** మండలంలోని ఆయా గ్రామాలలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహాశీల్దార్ నాగవీణ బిఎల్ఓలకు సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని గ్రామ సచివాలయం 1 లో శనివారం తహాశీల్దార్ నాగవీణ, డిప్యూటీ తహాశీల్దార్ చంద్రశేఖరయ్య ఎస్ ఐ ఆర్ ప్రక్రియ సర్వే నిర్వహణలో చేపట్టాల్సిన విధివిధానాలపై బిఎల్వోలు, బిఎల్ఎ లు, ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్వహణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియలో మరణించిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, డబుల్ ఓట్లను తొలగించడం జరుగుతుందన్నారు. కొత్తగా ఓటర్ నమోదు చేయడం జరుగుతుందని బి ఎల్ వో లు ఇంటి వద్దకు వచ్చినప్పుడు వారు అడిగిన సరైన పత్రాలు ప్రజలు అందించాలని తెలిపారు. ఓటరు జాబితా నుండి ఓటును తొలగిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఇటువంటి వాటిని ఓటర్లు నమ్మరాదని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల కమిషన్ పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహిస్తుందని ఎటువంటి పొరపాట్లు జరిగే అవకాశం లేదన్నారు. జూలై నెల 21 తర్వాత డ్రాఫ్ ఓటర్ జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని, బి ఎల్ ఏ లకు అందజేసిన ఓటరు జాబితా ప్రకారం కొత్తగా ప్రదర్శించిన ఓటర్ జాబితాలో ఎవరివైనా ఓటు నమోదు కాకుంటే వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసి ఓటు నమోదు అయ్యేలా చూసుకోవాలని బిఎల్ఏ లకు సూచించామని తహాశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు, ఓటర్లు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మొహరం వేడుకలు



**రుద్రవరం ప్రతినిధి జూన్ 27 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలో మొహరం వేడుకలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన రుద్రవరంలో నాలుగు రోజులుగా చిన్న సరిగెత్తు, మౌలాలి స్వామి సరిగెత్తు, పెద్ద సరిగెత్తు కార్యక్రమాలలో భాగంగా చిన్న చావిడి, మౌలాలి స్వామి చావడి, పెద్ద చావిడి లలో కొలువైన మౌలాలి స్వామి, దస్తగిరి స్వామి తో పాటు ఆయా స్వాముల పీర్లను అలాగే కొండమాయపల్లె గ్రామంలోని చావిడిలో కొలువైన పీర్లను గ్రామంలో ఘనంగా ఊరేగింపు కార్యక్రమాలను పీర్ల నిర్వాహకులు భక్తులు నిర్వహించారు. మొహరం పర్వదినంలో భాగంగా చివరి రోజు శనివారం సాయంత్రం రుద్రవరం కొండమాయపల్లె గ్రామాలలోని చావీడీలలో కొలువైన పీర్లను గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాలను అంగరంగ వైభోగంగా నిర్వహించి ఏటికి సాగనంపారు. పీర్లు ఏటికి పయనం అయ్యే ఊరేగింపు కార్యక్రమంలో యువకులు పలు వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో యువకులు మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏటికి వెళ్లే పీర్లను కనుల విందుగా తిలకించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## భక్తిశ్రద్ధలతో మోహరం వేడుకలు

**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని ముసలిమడుగు గ్రామంలో భక్తిశ్రద్ధలతో మోహరం వేడుకలు కుల, మతాలకు అతీతంతా జరిగాయి. సాయంత్రం నుంచే భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. పీర్లకు రంగురంగుల దుస్తులు, పూలతో అందంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాల మధ్య పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు దారిపొడువునా నీళ్లుపోసి, చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లు జలధికి తరలాయి. మొహరం సందర్భంగా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.



## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.




**రుద్రవరం ప్రతినిధి జూన్ 27 (నంది పత్రిక):** నేడు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్,నాగశ్రీజా రెడ్డి ప్రజలను కోరారు. పోలియో చుక్కల కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శనివారం ఆలమూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామ సచివాలయాలలో 0 నుండి 5 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు మొత్తం 3206 మంది ఉన్నారని తెలిపారు. నేడు (ఆదివారం) ప్రతి చిన్నారికి పోలియో చుక్కల మందు వేయడం జరుగుతుందని కనుక తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారిని అంగవైకల్యం బారిన పడకుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రసూల్, ఫార్మాసిస్టు నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్ సారనాథ్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారారోయింగ్‌లో 'ప్యాపిలి' కెరటం: జాతీయ స్థాయిలో నారాయణకు డబుల్ గోల్డ్ మెడల్స్




**నందిపత్రిక –ప్యాపిలి** ప్యాపిలి గ్రామానికి చెందిన పారారోయింగ్ క్రీడాకారుడు కొంగనపల్లి నారాయణ జాతీయ స్థాయిలో అసాధారణ ప్రతిభ కనబరిచి సరికొత్త రికార్డు సృష్టించారు. దేశస్థాయి పారారోయింగ్ ఛాంపియన్షిప్‌లో వరుసగా రెండు రోజుల్లో రెండు బంగారు పతకాలను కైవసం చేసుకొని స్వగ్రామానికి, జిల్లాకు దేశవ్యాప్త గుర్తింపు తెచ్చారు.

**వరుస విజయాలతో స్వర్ణ కేతనం:** జూన్ 26 అవుట్‌డోర్ విభాగం దేశంలోని 8 రాష్ట్రాల నుండి అత్యుత్తమ క్రీడాకారులు పాల్గొన్న దేశస్థాయి 'అవుట్‌డోర్ పారారోయింగ్ ఛాంపియన్షిప్'లో నారాయణ అద్భుత ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. జూన్ 27 ఇండోర్ విభాగం శనివారం ఎనిమిది రాష్ట్రాల మధ్య అత్యంత హోరాహోరీగా జరిగిన దేశస్థాయి 'ఇండోర్ పారారోయింగ్ ఛాంపియన్షిప్'లోనూ నారాయణ తన జోరును కొనసాగించి, మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. వరుసగా రెండు రోజుల్లో రెండు స్వర్ణాలు సాధించి నారాయణ సంచలనం సృష్టించారు.

**ప్యాపిలిలో మిన్నంటిన సంబరాలు:** జాతీయ స్థాయిలో డబుల్ గోల్డ్ మెడల్స్‌తో మెరిసిన కొంగనపల్లి నారాయణ ప్రతిభ పట్ల ప్యాపిలి గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.నారాయణ సాధించిన ఈ విజయం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఇదే పట్టుదలతో భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై, ఒలింపిక్ స్థాయిలోనూ బంగారు పతకాలు సాధించి మన గ్రామానికి, దేశానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి" అని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆకాంక్షిస్తూ ఆయనకు ఘనంగా శుభాభినందనలు తెలియజేశారు.



## ప్యాపిలీలో ఘనంగా ముగిసిన మొహరం వేడుకలు పోటెత్తిన భక్తులు

### ఖాజా బందే నవాజ్, గుడిమిరాళ్ల స్వామి, దస్తగిరి స్వాములను దర్శించుకున్న ప్రజలు

**నందిపత్రిక –ప్యాపిలీ**మండల పరిధిలోని ప్యాపిలీ గ్రామంలో గత కొన్ని రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న మొహరం వేడుకలు శనివారం అత్యంత వైభవంగా ముగిశాయి. కులమతాలకు అతీతంగా సాగిన ఈ వేడుకల ముగింపు రోజున భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వేడుకల ముగింపు సందర్భంగా గ్రామంలో ఖాజా బందే నవాజ్ స్వామి, గుడిమిరాళ్ల స్వామి, దస్తగిరి స్వామి పీర్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వాములకు చక్కెరను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో హిందూ, ముస్లింలు కలిసికట్టుగా పాల్గొనడం ఇక్కడి మత సామరస్యానికి అద్దం పట్టింది. సుదూర ప్రాంతాల నుండి సైతం భక్తులు తరలివచ్చి స్వామివార్ల ఆశీస్సులు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీర్ల నిమజ్జనంతో ఈ ఏడాది మొహరం వేడుకలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.



# చెంచుల భూమి చెంచులకే దక్కాలి - దళారులకు దక్కకూడదు!

## ఐటీడీఏ, రెవెన్యూ అధికారుల తీరుపై అడవిబిడ్డల ఆగ్రహం.
## చెంచు గిరిజనుల భూపోరాటం.

**వెలుగోడు జూన్ 27 నంది పత్రిక:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడవిబిడ్డలైన చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక చట్టాలు తెచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో వారికి మాత్రం అన్యాయమే జరుగుతోంది. దేశంలోనే అత్యంత అరుదైన, తక్కువ జనాభా కలిగిన చెంచు గిరిజనుల సంరక్షణార్థం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఐటీడీఏ ప్రాజెక్టును ఏర్పాటు చేసి అధికారులను నియమించింది. అయితే, కొందరు అధికారులు తమ బాధ్యతలను విస్మరించి, స్థానిక నాయకులు, దళారులతో కుమ్మక్కవుతున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెంచులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, హక్కులు, చివరకు వారికి కేటాయించిన భూములను కూడా దళారులు స్వాహా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

**40 ఏళ్ల క్రితం ఇచ్చిన భూమి.. నేటికీ దక్కని హక్కు!** వివరాల్లోకి వెళితే.. వెలుగోడు మండలం, వెలుగోడు గ్రామానికి చెందిన కొందరు నిరుపేద చెంచు కుటుంబాల జీవనోపాధి కోసం సుమారు 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఐటీడీఏ, మండల రెవెన్యూ అధికారుల ద్వారా పాములపాడు మండలం వేంపెంట గ్రామ పొలిమేరల్లో భూములను కొనుగోలు చేసి పంపిణీ చేసింది.కానీ, దశాబ్దాలు గడుస్తున్నా ఆ భూములు ఇప్పటికీ దళారుల కబ్జాకోరల్లోనే మగ్గుతున్నాయి. ఆ అమాయక గిరిజనుల పేర్లపై భూములు ఆన్‌లైన్ కాలేదు. దీనివల్ల గత ప్రభుత్వంలో కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో కానీ ఎలాంటి రైతు భరోసా లబ్ధి వీరికి అందలేదు. తమ భూముల కోసం జిల్లా కలెక్టరు కార్యాలయం, మండల రెవెన్యూ ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఏ ఒక్క అధికారీ కనికరించలేదని గిరిజనులు కన్నీరుమున్నీరవుతున్నారు. చివరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేలో కూడా వీరికి సమాచారం ఇవ్వకుండా, వీరి భూములను చూపించకుండా దాటవేయడంపై అడవిబిడ్డలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**సర్వే నెంబర్ ఒకచోట.. భూమి ఇంకొకచోట!**
అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం మండల రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు గ్రామ సర్వేయర్, సిబ్బంది కలిసి భూమిని సర్వే చేశారు. అయితే, గిరిజనుల పట్టాదారు పాస్ బుక్ లలో ఉన్న సర్వే నెంబర్ ఒకచోట ఉంటే, అధికారులు మాత్రం అమాయక చెంచులకు వేరొక చోట భూమిని చూపిస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి.

**గిరిజన సంఘాల డిమాండ్:**
పట్టాదారు పాస్ బుక్ లలో ఏ సర్వే నెంబరు అయితే నమోదై ఉందో, ఖచ్చితంగా అదే సర్వేనెంబర్ గల భూమినే తమకు అప్పగించాలని చెంచులు, అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ఐటీడీఏ అధికారులు తక్షణమే స్పందించి పాములపాడు మండలంలోని చెంచు గిరిజన భూములను క్షేత్రస్థాయిలో సందర్శించి, దళారుల నుంచి వారి భూములను విడిపించి న్యాయం చేయాలని కోరారు. ఈ భూపోరాట కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి కే. ఆనందరావు, జిల్లా కోశాధికారి లాలునాయక్, మరియు చెంచు గిరిజన రైతులు నారాయణ, పోతురాజు, నాగరాజు, పాపులమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఎం శిక్షణా తరగతుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్.




2026 జూన్ 27వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు, కడప స్థానిక ఆర్.కే.నగర్ లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో "శాస్త్రీయ ప్రాంతీయ శిక్షణ తరగతుల" కు కడప నగర కమిటీ సభ్యులు కామ్రేడ్ కుమారస్వామి ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు.-- ప్రశ్నించే వారిని హింసించే చట్టాలు బిజెపి ప్రభుత్వం తెస్తోంది. పాలకులలో విలువలు పడిపోయి, అహంకారం పెరుగుతోంది.పాలకులు ధనికులకు అనుకూలంగా ఉన్నారని ప్రజల్లో దృఢంగా ఉంది. కులం, మతం, ధనిక పక్షపాతం లేని పాలన కోసం ప్రజలు ఆరాటపడుతున్నారు. పాలకుల, అధికారుల అహంకారానికి, ప్రజల నిరసనలకు మధ్య జరిగే ఘర్షనే చరిత్ర. బిజెపి కి వ్యతిరేకంగా ఏర్పడిన రాజకీయ శూన్యత ఏర్పడింది. ఈ క్లాసులను సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడుతూ... నేడు దేశంలో ప్రశ్నించే వారిని హింసించే చట్టాలు కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులు పెట్టి చట్టాలు చేస్తోందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో "ప్రశ్నతోనే ప్రగతి" ప్రారంభమవుతుందని, ఇదే "శాస్త్రీయ ఆలోచన" అని తెలిపారు. పాలకులలో విలువలు పడిపోయి పతనావస్థకు చేరుకున్నదని, ప్రజా ప్రతినిధుల అహంకారం, అవినీతి, అధికారుల సహకారం పై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతుందని, ప్రజల్లో నిరసనలు విస్తృతం అవుతున్నాయని, నేటి దేశ యువతి, యువకుల్లో అసంతృప్తి తీవ్రమై "కాక్రోచ్ " "జెట్.జనరేషన్ ఉద్యమాల" లాంటివి ఏ రాజకీయాలకు సంబంధం లేని "ఉద్యమ సంస్థలు" ఉద్భవిస్తున్నాయన్నాయని గుర్తు చేశారు. కులం, మతం, ధనిక పక్షపాతం లేని పాలన కోసం ప్రజలు ఆరాటపడుతున్నారని తెలిపారు. పాలకుల దురాశ, అహంకారానికి వ్యతిరేకంగా ప్రజల నిరసనల మధ్య జరిగే ఘర్షనే చరిత్ర అని తెలిపారు. దేశంలో , రాష్ట్రంలో బిజెపి వ్యతిరేక ఉద్యమ శూన్యత ప్రస్ఫుటంగా కనపడుతోందని వామపక్ష, ప్రజాస్వామ్యం, లౌకిక ఆలోచనపరుల ఐక్యవేదికల ద్వారా ప్రజాస్వామ్యం స్ఫూర్తిని కాపాడాలని, నేటి యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కడప నగర కమిటీ కార్యదర్శి ఏ.రామ్మోహన్, క్లాస్ టీచర్ వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, లక్ష్మీదేవి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, సీనియర్ నాయకురాలు ఐ.ఎన్.సుబ్బమ్మ గార్లు, ప్రజానాట్యమండలి నాయకులు బాల చెన్నయ్య, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణయా తదితర సిపిఎం సభ్యులు క్లాసులకు హాజరయ్యారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం.. సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి: డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి



**నంది పత్రిక -డోన్** ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని డోన్ టీడీపీ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు . శనివారం డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా వినతిపత్రాలను స్వీకరించారు.

**ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ** ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజలు తమ పరిధిలోని పలు ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

తాగునీటి సరఫరా: పలు వార్డులు, గ్రామాల్లో నీటి ఎద్దడి, క్రమబద్ధమైన సరఫరా లేకపోవడం.రహదారుల దుస్థితి: అంతర్గత రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం.సామాజిక పింఛన్లు: అర్హులకు పింఛన్లు అందజేయడం, సాంకేతిక సమస్యల తొలగింపు.విద్యుత్ ఆరోగ్యం: నాణ్యమైన విద్యుత్ సరఫరా, స్థానిక ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాల మెరుగుదల.

**అధికారులతో సమన్వయం.. తక్షణ చర్యలు** ప్రజలు సమర్పించిన ప్రతి వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ఎంతో శ్రద్ధగా పరిశీలించారు. అక్కడికక్కడే కొన్ని సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడి, త్వరితగతిన తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "ప్రజా సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడానికి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను నా దృష్టికి తీసుకురావచ్చు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం శ్రమిస్తాఅన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.



## సీఎం పర్యటన వేళ ట్రాఫిక్ ఆంక్షలు



**మహానంది జూన్ 27 (నంది పత్రిక):-** ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలం కృష్ణం శెట్టిపల్లె పర్యటనకు వస్తున్న నేపథ్యంలో మహానంది మండలంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే వాహనాలకు ముందస్తు అనుమతి ఉంటే తప్ప ముందుకు సాగనివ్వలేదు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ ఆంక్షలు విధించినట్లు మహానంది ఎస్ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మండలంలోని బోయలకుంట్ల మెట్ట- ఆంజనేయపురం వద్ద పోలీసులు భారీగేట్లు ఏర్పాటు చేసి వాహనాలను నిలిపివేశారు. సీఎం పర్యటన అనంతరం వాహనాల రాకపోకలు యధావిధిగా కోనసాగాయి.

## ఎస్ఐఆర్ ఫారాల పూరింపునకు విశేష స్పందన.. భారీగా తరలివచ్చిన ప్రజలు

**వెలుగోడు, జూన్ 27 (నంది పత్రిక):** వెలుగోడు మండల పరిధిలోని 108 బూత్ నందు శనివారం ఎస్ఐఆర్ ఫారాల పూరింపు కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ ఎస్ఐఆర్ ఫారాలను పూరించుకున్నారు.ఫారాల పూరింపు ప్రక్రియను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయ సహకారాలు అందించారు.కార్యక్రమంలో అచ్చయ్య, వహీద్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు ఇలియాస్ ఖాన్ పాల్గొన్నారు.



## విండ్ పవర్ ప్రాజెక్టు రైతులకు ఊరట అని తెలిపిన ఆర్డీవో నరసింహులు.



**బేతంచెర్ల, జూన్ 27 ( నందిపత్రిక** బేతంచెర్ల మండలంలో విండ్ పవర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో నరసింహులు తెలిపారు. శనివారం బేతంచెర్ల మండల తహశీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో మునలాయి చెరువు, ముద్దవరం,బేతంచెర్ల గ్రామాల రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఆన్‌లైన్‌లో నమోదై,అసైన్‌మెంట్ పట్టా ఉన్న అర్హులైన ప్రతి రైతుకూ నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కోడుమూరు నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు రూ. 8,03,345/- అక్షరాల ఎనిమిది లక్షల మూడు వేల మూడు వందల నలభై ఐదు రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పంపిణీ చేయడం జరిగింది చెక్కులను తీసుకున్న లబ్ధిదారులు సీఎం నారా చంద్రబాబు నాయుడు కి డి.విష్ణువర్ధన్ రెడ్డి కి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కి ధన్యవాదాలు తెలిపారు. లబ్ధిదారుల పేర్లు మరియు సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలు

1.శేఖర్ ₹1,08,735/-2.బి సునీత ₹50,808/- 3.షేక్ బషీర్ ₹44,584/-
4.పద్మావతి ₹27,672/- 5.వరలక్ష్మి ₹15584/- 6.వెంకట్రామి రెడ్డి ₹44,584/-
7.పూర్ణిమ ₹19,641/- 8.వి రాధా ₹57,197/- 9.నాగార్జున ₹20,641/-
10.పుల్లోల దేవరాజు ₹27,655/- 11.బి సువర్ణ దేవి ₹70,918/- 12. సత్యరాజు ₹61,084/- 13. అనిత -40,255/- 14. మౌనిక -₹30,000/- 15. అధికారి బొజ్జి రెడ్డి -₹91,459/- 16. లక్ష్మి రెడ్డి -₹40,350/- 17. నీలప్ప -₹47,178/-

## రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది:డోన్ ఎమ్మెల్యే కోట్ల



**నంది పత్రిక -డోన్** రైతు సంక్షేమం వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. డోన్ మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో విత్తనాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ ఆధునిక పద్ధతి ద్వారా తొలి వర్షాలతోనే పంట వేగంగా మొలకెత్తుతుందని, దీనివల్ల సాగు ఆలస్యం తగ్గడంతో పాటు దిగుబడి పెరిగే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.

**ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి:** రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, శాస్త్రీయ సలహాలను పాటించి ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక మార్గదర్శకాలు రైతు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి రైతుకు ఎల్లవేళలా అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు."డోన్ నియోజకవర్గంలోని ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలి. తద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు పాల్గొన్నారు.




## భద్రత గుర్తెరిగి.. పలువురికి ఆదర్శంగా నిలిచి

**మహానంది, జూన్ 27 (నంది పత్రిక):-** నేటి కాలంలో ప్రమాదాలు అధికమవుతున్న తరుణంలో భద్రతను గుర్తెరిగి పలువురికి ఆదర్శంగా నిలిచిన ఓ కుటుంబానికి పోలీసుల అభినందనలు వెల్లువెత్తాయి. శనివారం గాజులపల్లెకి చెందిన మాబూ కుటుంబ సభ్యులు నంద్యాల నుంచి వస్తుండగా బోయలకుంట్ల మెట్ట వద్ద బందోబస్తు చేస్తున్న ఎస్సై రామ్మోహన్ రెడ్డి అభినందించారు. కుటుంబ సభ్యులతోపాటు చిన్నారికి హెల్మెట్ ధరించడం పట్ల అభినందించారు. ఇలాంటి వ్యక్తులను మనమందరం ఆదర్శంగా తీసుకొని రోడ్డు ప్రమాద నివారణలో ప్రాణాలు కాపాడుకోవాల్సిందిగా ఎస్సై సూచించారు.



## "పల్స్ పోలియోను విజయవంతం చేయండి " డాక్టర్ నరసింహ



**ఆళ్లగడ్డ: ప్రతినిధి జూన్ 27 నంది పత్రిక** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ లో పల్స్ పోలియోపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహ మాట్లాడుతూ ఆళ్లగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్లో 31 బూత్ లు ఏర్పాటు చేశామని అందులో ఒకటి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేశామని అలాగే ఒక మొబైల్ టీం కూడా ఏర్పాటు చేశామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ నందు 0-5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. అందువల్ల ఈనెల 28వ తారీఖున పల్స్ పోలియో సందర్భంగా చిన్నారులకు పల్స్ పోలియో రాకుండా పోలియో చుక్కలు వేయించుకొని పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. చిన్నారుల భవితకు చుక్కల మందు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీతిక రెడ్డి , ఎంపిహెచ్ఈఓ వి. దస్తగిరి రెడ్డి , సూపర్వైజర్ భాగ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, సచివాలయం ఏఎన్ఎంలు మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు

## రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మను కలిసిన విశ్వబ్రాహ్మణులు



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 27 నంది పత్రిక** రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ ఆళ్ళగడ్డ విచ్చేసిన సందర్భంగా వారిని కలిసిన ఆళ్ళగడ్డ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు కడప జిల్లా పులివెందుల లింగాల లోపానుతల గ్రామంలో నాలుగు సంవత్సరాల చిన్నారి హత్య జరిగింది ఈ సందర్భంగా ఆ గ్రామానికి వెళ్లి బాధ్యత కుటుంబాన్ని పరామర్శించి అనంతరం తిరుగు ప్రయాణంలో ఆళ్లగడ్డలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులందరినీ ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమె అందరినీ పేరుపేరునా పలకరించారు అనంతరం తిరిగి కర్నూలు కి వెళ్ళిపోయారు.

## మహారాష్ట్ర టెట్: డ్రెస్ కోడ్‌లో మార్పు..

మహారాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) డ్రెస్ కోడ్‌కు సంబంధించి రాష్ట్ర పరీక్షా మండలి (ఎంఎస్‌సీఈ) కీలక సవరణలు చేసింది. మహిళా అభ్యర్థులు హిజాబ్, బురఖా లేదా దుపట్టా ధరించి పరీక్షకు హాజరయ్యేందుకు అనుమతించింది. అయితే, సీసీటీవీ నిఘా మరియు బయోమెట్రిక్ వెరిఫికేషన్ ప్రక్రియల నిమిత్తం ముఖం, చెవులు, నోరు స్పష్టంగా కనిపించాలని నిబంధన విధించింది.

## బేతంచెర్ల ఎంజేపీ హాస్టల్లో నిర్లక్ష్యం.

### గంటల తరబడి తల్లిదండ్రుల నిరీక్షణ.






**బేతంచెర్ల, జూన్ 27 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం గొరుమానుకొండ గ్రామ పరిధిలోగల మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల హాస్టల్‌లో శని వారం తీవ్ర నిర్లక్ష్యం బయటపడింది. 5వ తరగతిలో సీటు వచ్చి, హాస్టల్లో చేరడానికి వచ్చిన నంద్యాల,ఆవుకు,బెలగల్ తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు, మధ్యాహ్నం 12 గంటల నుంచి వేచి ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు.సమస్య చెప్పు కుందామని తల్లిదండ్రులు వైస్ ప్రిన్సిపాల్‌ను,ఇతర సిబ్బందిని కలవగా "సీట్ల విషయం మేము మాట్లాడలేం, ప్రిన్సిపాల్‌నే కలవాలి" అని చెప్పారు. కానీ ప్రిన్సిపాల్‌ను కలిసే అవకాశం ఇవ్వలేదు,ప్రిన్సిపాల్ గది తలుపులు,స్టాఫ్ రూమ్ తలుపులు మూసివేయడంతో,తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ సిబ్బందిని అడగగా "ప్రిన్సిపాల్ భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్నారు" అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ హాస్టల్‌లో,ఈ విధమైన వ్యవహారం సమంజసం కాదని తల్లిదండ్రులు మండిపడ్డారు.ఈ సంఘటనపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి,బాధ్యులైన వారిపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం గాకుండా చూడాలని, అక్కడికి వచ్చిన ప్రజలు డిమాండ్ చేశారు.

# నిందితులకు కఠిన శిక్ష విధించాలి





### బాధిత కుటుంబానికి సాక్షులకు రక్షణ కల్పించాలి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పర్వతమ్మ

**కడప బ్యూరో చీఫ్ జూన్ 27 నంది పత్రిక** అభం శుభం తెలియని చిన్నారి నిత్విక ను క్రూరంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ డిమాండ్ చేశారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లోపానుతల గ్రామంలో నాలుగు సంవత్సరాల చిన్నారిని నీటి దమ్ములో ముంచి హత్య చేసిన విషయం తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ పార్వతమ్మ శనివారం పులివెందుల నియోజకవర్గం లోపానుతల గ్రామానికి తరలిరావాలని విశ్వబ్రాహ్మణులకు పిలుపునిచ్చారు. దీంతో భారీ సంఖ్యలో తరలివచ్చిన విశ్వబ్రాహ్మణులతో కలిసి లోపాను తల గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి చిన్నారి భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారిని హత్య చేసిన హంతకులను ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. అభం శుభం జరుగని చిన్నారిని హత్య చేయడం అమానుషమన్నారు. అనంతరం సంఘటన స్థలం నుంచి జిల్లా ఎస్పీ తోను, బీసీ మంత్రి సబితమ్మతో మాట్లాడి నిందితులకు కఠిన శిక్ష విధించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చేయాలంటేనే భయం పుట్టే విధంగా శిక్షలు ఉండాలని ఆమె డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి సాక్షులకు రక్షణ కల్పించాలని అలాగే నిందితులు ఎంతటి వారైనా కఠిన శిక్షలు విధించాలన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ నిందితులను గ్రామ బహిష్కరణతో పాటు కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా డైరెక్టర్ కె రంగాచారి కడప జిల్లా డైరెక్టర్ వి శ్రీనివాసాచారి. పులివెందుల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు పి మాధవాచారి అధ్యక్షుడు మద్దిలేటి ఆచారి బివి భాస్కర్ బాబు అనంతపురం కొత్తపల్లి సత్యనారాయణ విజయవాడ నిమ్మి కంటి వీరబ్రహ్మం కడప నిమ్మి కంటి నరసింహాచారి ప్రొద్దుటూరు వీరభద్రా చారి జివి రమణ చారి. ధనుంజయ చారి తిమ్మయ్య చారి కర్నూల్ కె రామాచారి విశ్వకర్మ తదితరులు పాల్గొన్నారు

## పోలీసు బందోబస్తు మధ్య అహోబిలం టోల్ గేటు వేలం పాటలు

### 25.04 లక్షలకు టెండర్ దక్కించుకున్న సానా సురేష్



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 27 నంది పత్రిక** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో పంచాయతీ టోల్ గేటు వేలం పాటలను శనివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. అహోబిలంలోని టీటీడీ కళ్యాణ మండపంలో నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో ఈ వేలం పాటలను నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది డిపాజిట్ దారులు ఈ వేలం పాటలో పాల్గొన్నారు. అహోబిలం గ్రామానికి చెందిన సానా సురేష్ 20. 4 లక్షలకు వేలం పాడి గేటు అర్హతను దక్కించుకున్నారు. దీంతో గత ఏడాది కంటే మూడు లక్షల రూపాయలు గేటు ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు డి ఎల్ పి ఓ రాంబాబు తెలిపారు. గేటు వేలం పాటలలో ఇరు వర్గాలకు చెందినవారు పాల్గొనడంతో అహోబిలంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. దీంతో వేలంపాట పరిసరాల్లో రూరల్ సీఐ బీవీ రమణ, సిరివెళ్ల సిఐ రాము ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వేలంపాటల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ బీవీ రమణ ఎస్ఐ వరప్రసాద్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు . ఈ వేలంపాట లో ఈఓఆర్డి సరళ, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ( సర్)వేగవంతం చేయండి.

### కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించండి.

### కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 27 నంది పత్రిక** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ( సర్ ) ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని పోస్టల్ కాలనీ లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ( సర్ )ప్రక్రియను, పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ పారాలను ఇప్పటికే అందరికీ చేర్చడం జరిగిందని తెలిపారు. బి.ఎల్.ఓ. లు అందరి ఇండ్లకు వెళ్లి ఈ పారాలను గూర్చి కూలంకుశంగా వివరించి తప్పులు లేకుండా పూర్తి చేయించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రత్యేక కార్యాచరణతో ఓటర్ల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నగరంలోని ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లలిత, శానిటరీ సూపర్వైజర్ సుమతి, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

## ప్రత్యేక కేటగిరీ లబ్ధిదారులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ

### వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వారికి సేవలు అందేలా చర్యలు

### జిల్లా జాయింట్ కలెక్టర్- టి. రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 27 నంది పత్రిక** ప్రభుత్వం ప్రత్యేక కేటగిరీలకు చెందిన లబ్ధిదారుల సౌకర్యార్థం ప్రతి నెల 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం తాడేరు గ్రామంలో నిర్వహించిన నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎఫ్‌పి షాప్ నెం.55ను ఆకస్మికంగా తనిఖీ చేసి పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు సంబంధిత రేషన్ డీలర్లు స్వయంగా ఇంటి వద్దకు వెళ్లి బియ్యం, గోధుమలు, పంచదార తదితర నిత్యావసర సరుకులు అందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక సేవను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా తాడేరు గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు కె.సీతామహాలక్ష్మికి రేషన్ వస్తువులు బియ్యం, గోధుమలు, పంచదార అందజేసే సమయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీ, బయోమెట్రిక్ విధానం, లబ్ధిదారులకు అందుతున్న సేవలను పరిశీలించి, పారదర్శకంగా పంపిణీ జరిగేలా అధికారులు, డీలర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.సరోజ, ఏఎం దుర్గారావు, సీఎస్‌డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఓబులంపల్లి పేరాయిపల్లి గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించిన తహాశీల్దార్ జ్యోతిరత్నకుమారి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 27 నంది పత్రిక** మండలంలోని పేరాయిపల్లె, ఓబులంపల్లి గ్రామాల్లో ఎస్ఐఆర్ పై జరుగుతున్న ప్రక్రియను మండల తహాశీల్దార్ జ్యోతి రత్నకుమారి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎస్ఐఆర్ ఫారంల పంపిణీ, డిజిటలైజేషన్ వివరాలను సంబంధిత బిఎల్ఓల ద్వారా తెలుసుకున్నారు. గడువు నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని బిఎల్ఓ లను తహాశీల్దార్ ఆదేశించారు. ఈ ప్రక్రియకు ఇంటి వద్దకు వచ్చు బిఎల్ఓ లకు ప్రజలు సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని ఆమె కోరారు. ముందుగానే ఫోటోలు ఆధార్ కార్డు తదితర వివరాలను ప్రజలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ వలి ఉన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం...

## ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో 100 శాతం అడ్మిషన్లకు కృషి చేయాలి



**హెచ్‌డబ్ల్యూవోలు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి**

**ఎస్సీ, బీసీ హాస్టళ్లలో మెరుగైన వసతులు...**

**మెరుగైన భవిష్యత్తు - విద్యతోనే ఆర్థికాభివృద్ధి**

**డ్రాప్‌అవుట్‌లకు తావులేదు... ప్రతి విద్యార్థి చదువుకోవాల్సిందే**


**విద్య ద్వారానే కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయి**

**జిల్లాలోని వసతి గృహాల్లో మెరుగైన వసతులు**

**త్వరలో సోలార్ హీటర్ల ఏర్పాటు**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్: జూన్ 27, నంది పత్రిక** ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, ప్రతి వసతి గృహంలో నూరు శాతం విద్యార్థుల చేరికలు సాధించేందుకు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు (హెచ్‌డబ్ల్యూవోలు) ప్రధాన బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా కలెక్టర్ ఎస్సీ, బీసీ వసతి గృహాల అధికారులతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, జిల్లాలోని వసతి గృహాల ప్రస్తుత పరిస్థితులు, విద్యార్థుల చేరికలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో దశలవారీగా మెరుగైన వసతులు కల్పించామని, ఇటీవల సోలార్ లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు త్వరలో సోలార్ హీటర్లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్య అనేది ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధికి పునాది అని పేర్కొన్న కలెక్టర్, ప్రతి చిన్నారికి విద్య అందితేనే దేశం పురోగతి సాధిస్తుందని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ విద్యార్థులు 7, 8, 9 తరగతులలో ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రాప్ అవుట్ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేములదీవి, వీరవాసరం, పాతపాడు, రేలంగి, ఉండి, కాళీపట్నం తదితర ప్రాంతాల్లోని బీసీ వెల్ఫేర్ ప్రీ-మెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థుల చేరికలు తక్కువగా ఉండడంపై హెచ్‌డబ్ల్యూవోలను ప్రశ్నించిన జిల్లా కలెక్టర్, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో నూరు శాతం చేరికలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన భోజనం, మెస్ చార్జీల చెల్లింపులు, ఇతర అన్ని సంక్షేమ సౌకర్యాలు ఎలాంటి పెండింగ్ లేకుండా అందుతున్నాయని తెలిపారు. ఈ విషయాలను తల్లిదండ్రులు, విద్యార్థులకు పూర్తిగా వివరించి వసతి గృహాల్లో చేరేలా హెచ్‌డబ్ల్యూవోలు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే బీసీ, ఎస్సీ పోస్ట్-మెట్రిక్ వసతి గృహాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే విద్యార్థుల చేరికలు కూడా పెంచాలని ఆదేశించారు. గత విద్యాసంవత్సరంలో వసతి గృహాల్లో చదివిన అనేక మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తున్న నేపథ్యంలో, వారి పిల్లలు తప్పనిసరిగా వసతి గృహాల్లో చేరేలా భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ జూన్ కాన్ఫరెన్స్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి.అరుణ కుమారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ.వి.సూరిబాబు, హెచ్‌డబ్ల్యూవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ నీటి వనరులు, చెరువు భూములపై ఆక్రమణలు వెంటనే తొలగించాలి

**ప్రతి నెల 100 ఎకరాల లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 27, నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ నీటి వనరులు, చెరువు భూములపై జరిగిన ఆక్రమణలను వేగవంతంగా తొలగించి, భవిష్యత్తులో పునరాక్రమణలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుంచి శనివారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జలవనరుల శాఖ అధికారులతో జిల్లా వాచ్‌డాగ్ కమిటీ సమావేశంను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 362.21 ఎకరాల విస్తీర్ణంలో 7,458 ఆక్రమణలు గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 40 ఎకరాల పరిధిలో 1,257 ఆక్రమణలు తొలగించినట్లు పేర్కొంటూ, మిగిలిన ఆక్రమణలను తొలగించేందుకు ప్రతి నెల 100 ఎకరాల లక్ష్యంతో కార్యాచరణ చేపట్టాలని సూచించారు. మండల స్థాయి వాచ్‌డాగ్ కమిటీలు ప్రభుత్వ నీటి వనరులు, చెరువు భూములపై ఉన్న ఆక్రమణలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. చిన్నపాకలు, తాత్కాలిక నిర్మాణాలతో పాటు వాణిజ్య, ఇతర శాశ్వత నిర్మాణాలపై కూడా నిబంధనల ప్రకారం వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో అధికారులు పూర్తి పారదర్శకత, బాధ్యతతో వ్యవహరించాలని, తదుపరి వాచ్‌డాగ్ కమిటీ సమావేశానికి రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు మిగిలిన ఆక్రమణలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపులో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, వాచ్‌డాగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పల్స్ పోలియోకు పటిష్ట ఏర్పాట్లు...

## ఒక్క చిన్నారి కూడా మిస్ కాకూడదు

**జూన్ 28 నుంచి మూడు రోజుల పాటు సాగే కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలి**

**05 సంవత్సరాల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా అందించాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 27, నంది పత్రిక** జిల్లాలో రేపు ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేసి, 05 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన సమీక్షించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో పోలియో నిర్మూలన జరిగినప్పటికీ పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతి ఏడాది పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. జూన్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని, ఆదివారం బూత్‌లలో పోలియో చుక్కలు వేయించుకోలేని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఏ ఒక్క చిన్నారి మిస్ కాకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 1,74,756 మంది 05 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 1,151 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు 5,520 మంది అధికారులు, సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. బస్సు స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేసి ప్రయాణాల్లో ఉన్న చిన్నారులకు కూడా పోలియో చుక్కలు అందించాలని సూచించారు. వలస కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల కుటుంబాలు, గ్రామాల చివర గుడారాల్లో నివసించే కుటుంబాల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే వ్యాక్సిన్ నిల్వ, రవాణా, కోల్డ్ చైన్ వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లాలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో నూరు శాతం లక్ష్యాన్ని సాధించి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని అన్ని శాఖలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ జూమ్ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాభాయి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుదాలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పి. సూర్యనారాయణ, డీపీవో కె. అనురాధ, డీఈవో ఇ. నారాయణ, డిఆర్డిఎ పి.డి. ఎమ్మెస్సెస్ వేణుగోపాల్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎన్.వి. అరుణకుమారి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు. మంగపతిరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి. శ్రీలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వార్త ప్రజా శ్రేయస్సుకు దోహదపడేదిగా ఉండాలి

**మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా పాత్రికేయులు నిరంతరం నైపుణ్యాలు పెంపొందించుకోవాలి**

**గ్రామీణ విలేకరుల రెండురోజుల పునశ్చరణ శిక్షణా తరగతులను ప్రారంభించిన సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్**



**పాలకొల్లు బ్యూరో చీఫ్ జూన్ 27, నంది పత్రిక**వార్త ప్రజా శ్రేయస్సుకు దోహదపడేదిగా ఉండాలని, సమాజానికి విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడంలో పాత్రికేయులు కీలక బాధ్యతతో వ్యవహరించాలని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అన్నారు పాలకొల్లులోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో శనివారం ప్రారంభమైన గ్రామీణ విలేకరుల రెండురోజుల పునశ్చరణ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులు కాలానుగుణంగా మారుతున్న సాంకేతికత, ఆధునిక జర్నలిజం విధానాలపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సీనియర్ జర్నలిస్టుల అనుభవాన్ని, నైపుణ్యాన్ని కొత్తతరం పాత్రికేయులకు అందించడమే ఈ శిక్షణల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమగ్ర అవగాహన, వాస్తవాల ఆధారంగా రూపొందిన వార్తలే పాత్రికేయులకు గౌరవం, విశ్వసనీయతను తీసుకొస్తాయని పేర్కొన్నారు.డెస్క్‌తో సమన్వయం రూరల్ రిపోర్టింగ్‌లో మెలకువలు“ అంశంపై ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి దేవగళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ, వార్తలు పాఠకులను ఆకర్షించే విధంగా ఉండాలని, వార్త రచనలో ఖచ్చితత్వం, స్పష్టత, సరైన శీర్షికకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాత్రికేయులు తాము పంపిన వార్తలతో పాటు ఇతర పత్రికల్లో వచ్చిన కథనాలను కూడా అధ్యయనం చేస్తే తక్కువ సమయంలోనే మంచి జర్నలిస్టులుగా ఎదగగలరన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వార్తలు పంపేటప్పుడు డెస్క్‌తో సమన్వయం కొనసాగించడం వల్ల నాణ్యమైన వార్తలు అందించగలమని వివరించారు.కృత్రిమ మేధ (ఏఐ) సహాయక సాధనం మాత్రమే అనే అంశంపై ఎ.ఐ. ట్రైనర్ విజయకుమార్ కుర్రా మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పాత్రికేయులు సహాయకారిగా మాత్రమే ఉపయోగించాలని సూచించారు. సరైన సమాచారం పొందేందుకు సరైన ప్రాంప్ట్‌లు ఇవ్వడం, ఏఐ ద్వారా పొందిన సమాచారాన్ని తప్పనిసరిగా ఫ్యాక్ట్ చెక్ చేయడం అత్యంత ముఖ్యమన్నారు. డేటా విశ్లేషణ, పట్టికల తయారీ, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై సమాచార సేకరణలో ఏఐ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.సోషల్ మీడియా యుగంలో మీడియా పాత్ర“ అంశంపై సీనియర్ జర్నలిస్టు ఎస్.గురునాథ్ మాట్లాడుతూ, సోషల్ మీడియా విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో ప్రధాన మీడియాపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందన్నారు. ధృవీకరణ లేకుండా వార్తలను ప్రచురించకూడదని, వాస్తవ నిర్ధారణతో కూడిన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు అందించాలని సూచించారు. వార్త రచనలో విశ్లేషణాత్మక దృక్పథం, బాధ్యతాయుతమైన వైఖరి అవసరమన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో సి.ఆర్. మీడియా అకాడమీ మేనేజర్ ఎస్.శ్రీనివాస జీవన్, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన గ్రామీణ పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి

**జూన్ 28 నుంచి మూడు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం**

**పోలియో రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 27 నంది పత్రిక**

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, 05 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం భీమవరం ప్రకాష్ చౌక్ నుంచి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 28 నుంచి 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 1.75 లక్షల మంది 05 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 1,151 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 1,063 స్థిర కేంద్రాలు, 52 మొబైల్ బూత్‌లు, 36 ట్రాన్సిట్ బూత్‌లు ఉండగా, కార్యక్రమ నిర్వహణకు 4,518 మంది వైద్య సిబ్బంది సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వలస కూలీల పిల్లలను గుర్తించి వారికి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అవగాహన ర్యాలీ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజలకు నేరుగా అవగాహన కల్పిస్తూ, ఆదివారం సమీపంలోని పోలియో కేంద్రాలకు చిన్నారులను తీసుకువచ్చి రెండు చుక్కలు వేయించాలని కోరారు.

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి. గీతాభాయి మాట్లాడుతూ, ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని చిన్నారులకు జూన్ 29, 30 తేదీల్లో ఆశా, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుధాలక్ష్మి, వైద్య అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ట్రైనీ నర్సులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ పై అప్రమత్తంగా లేకపోతే నష్టపోతాం

## బీసీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

ఎస్ ఐ ఆర్ ( ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ) పై అప్రమత్తంగా లేకపోతే నష్టాన్ని మూటకట్టుకోవాల్సి వస్తుందని, తెలంగాణ బీసీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, సర్ పార్లమెంట్ కంట్రోల్ రూమ్ మహబూబాబాద్ కోఆర్డినేటర్ నూతి శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు. శనివారం నాడు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పై అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన నష్టం జరగడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో విశ్వాసంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, తనను సర్ పార్లమెంట్ కంట్రోల్ రూమ్ మహబూబాబాద్ కోఆర్డినేటర్ గా నియమించినందుకు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ పై పార్టీ నేతలు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐఆర్ పేరుతో రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓట్లలో మెజార్టీ శాతం ఓట్లను ఏదో ఒక కారణంతో పక్కన పెడతారని సందేహాన్ని వ్యక్తం చేశారు. అనుమానాస్పదం పేరుతో వాటిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని అదే జరిగితే రాజకీయంగా అత్యంత ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాల లోని ప్రతి గ్రామంలో ప్రతి బూత్ లో బూత్ లెవెల్ ఆఫీసర్లతో అనుసంధానం కావాలని సూచించారు. ముఖ్యంగా వలసలు వెళ్లిన వారి విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల అధికారులు ఇళ్ళకు వెళ్ళినప్పుడు వారు లేకపోవచ్చు అని అప్పుడు వారిని ఓట్లు తీసివేసే ప్రమాదం ఉందని అలాంటి ఓట్లను కూడా తొలగించకుండా పార్టీ నాయకత్వం జాగ్రత్తలు తీసుకోవాలని కార్యకర్తలు ఈరోజు నుండి క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఓట్లు తొలగించకుండా నిజమైన ఓటర్ ఓటు హక్కు కలిగే విధంగా చూసుకోవాలని సూచించారు.

**ఒక్క ఓటు పోకుండా చూడాలి..**

బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే పెద్ద ఎత్తున ఓట్లను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఓట్ల జాబితాలో చోటు చేసుకున్న లోపాలు తప్పులతో కూడిన అనామలిస్, జాబితాలోని ఓటర్ల విషయంలో క్షేత్రస్థాయి బూతులో ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని అర్హులైన ఏ ఒక్కరి ఓటు జాబితా నుండి తొలగించకుండా చూడాల్సిన బాధ్యత మనదే అని అన్నారు. ఈ పరిశీలన ప్రక్రియలో ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను గమనించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ మ్యాపింగ్ తో పాటు సందేహాస్పద ఓట్లను కూడా నిశితంగా గమనించాలని కేవలం ఒక వర్గానికి చెందిన ఓట్లు కాంగ్రెస్ అనుకూలం ఓట్లను మాత్రమే ఎస్ఐఆర్ లోభాగంగా తొలగిస్తారని అనుమానం కలుగుతుందని గతంలో భావించే వారమని కానీ ఏఐ సహాయంతో సోషల్ మీడియా అధ్యయనం ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలని కోరారు.

**సర్ ఉద్దేశం ఏమిటంటే..?**



ఇది ఓటర్లు రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారులందరి భాగస్వామ్యంతో నిర్వహించే కార్యక్రమం అని చనిపోయిన వారు, డూప్లికేట్ శాశ్వతంగా తరలిపోయిన వారు, అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి అర్హుల పేర్లను మాత్రమే చేర్చే ప్రత్యేక కార్యక్రమం అని బూత్ లెవెల్ (బి ఎల్ ఓ)అధికారులు ఇంటింటికి వెళ్లి ఓట్లను పరిశీలిస్తారని ఓటర్ల భర్తీ చేసిన ఎన్యూ మరేటర్న్ ఫారాలను పాత ఓటర్ డాటా తో సరిపోలుస్తారని 1951 నుంచి 2004 మధ్యకాలంలో 8సార్లు ఇలాంటి కసరత్తు చేపట్టారని నూతి శ్రీకాంత్ గౌడ్ గుర్తు చేశారు.

# రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే గొడ్డలి పార్టీ కుట్రలు ఇక సాగవు

## - అమరావతి రైతుల ఆగ్రహానికి కారణం వైసీపీ ద్వంద్వ వైఖరే: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, బ్యూరో చీఫ్ జూన్ 27: నంది పత్రిక** అమరావతి విషయంలో రాష్ట్ర ప్రజలను, రైతులను మోసం చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు మళ్లీ రైతుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. అమరావతి రాజధానిని ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేసి, వేలాది మంది రైతుల జీవితాలతో చెలగాటమాడిన వారే ఇప్పుడు 'అమరావతి రైతు పరిరక్షణ' పేరుతో కొత్త నాటకాలు ఆడటం సిగ్గుచేటు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అందుకే వైసీపీ నాయకులు ఎక్కడికి వెళ్లినా తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు అని అన్నారు. రాజకీయాల కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ప్రజల సహనాన్ని పరీక్షిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిస్పందనే వస్తుంది. ప్రజలను రెచ్చగొట్టి ఆ తర్వాత బాధితులమని నటించడం వైసీపీకి అలవాటైపోయింది. ఆ రాజకీయాలకు కాలం చెల్లింది అని అచ్చెన్నాయుడు అన్నారు. అమరావతి రైతుల నిరసనలను అణచివేసేందుకు వైసీపీ పాలనలో ఎలాంటి దౌర్జన్యాలు జరిగాయో రాష్ట్ర ప్రజలకు ఇంకా గుర్తున్నాయని, ఇప్పుడు అదే రైతుల పేరుతో రాజకీయ పర్యటనలు చేయడం పూర్తిగా అవకాశవాద రాజకీయమని విమర్శించారు. గొడ్డలి పార్టీ నాయకుల పర్యటన సందర్భంగా శాంతిభద్రతలను కాపాడేందుకు విధుల్లో ఉన్న పోలీసులపైనే దాడి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మంత్రి మండిపడ్డారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడటం అత్యంత విచారకరమని, ప్రజాస్వామ్యంలో పోలీసులపై దాడులకు ఎలాంటి సమర్థన ఉండదని స్పష్టం చేశారు. ప్రజలను రెచ్చగొట్టడం... ఉద్రిక్తతలు సృష్టించడం... తర్వాత నాటకాలు ఆడటం గొడ్డలి పార్టీ రాజకీయాలుగా మారాయి. అలాంటి చౌకబారు రాజకీయాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇక ఏమాత్రం నమ్మరు. అమరావతి రైతుల మనోభావాలను గౌరవించాల్సిందే తప్ప, వారిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# ఓటు ను కాపాడుకోని బీజేపీ కి బుద్ధి చెప్పుదాం

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించి వారికి అనుకూలమైన వాళ్ళను కాపాడడానికి తీసుకువచ్చిందే సర్ అని కావున ప్రజలందరూ తమ ఓట్లను కోల్పోకుండా సర్ కార్యక్రమంలో పాల్గొని కాపాడుకొని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కూ ని ఉన్నటువంటి బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడ కొట్టడానికి సిద్ధం కావాలని సర్ లో అందరూ పాల్గొనాలని నినాదంతో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గోడ పత్రికను షాపూర్ నగర్ లో ఆవిష్కరించారు. అక్రమ చొరబాటు దారు లు, ఇతర దేశస్తులు, మరణించిన వారి ఓట్లను తొలగిస్తున్నామని ప్రచారంతో తీసుకువచ్చిన సర్ అసలు ఉద్దేశం బిజెపికి వ్యతిరేకులు అయినటువంటి ముస్లిం, క్రైస్తవ, దళిత, బహుజనుల ఓట్లు తొలగించడమే ప్రధాన ఉద్దేశం అని అన్నారు. రాజ్యాంగంలో ఓటు పౌరుని హక్కు అని చెప్తే, ఓటరుగా చేర్చుకోవాల్సింది పోయి గతంలో ఓటర్ అయిన వారినీ కూడా అనుమానాస్పదం గా ఉంచడం, పేర్లలో చిన్న చిన్న తప్పులు ఉన్నప్పటికీ పక్కన పెట్టడం లాంటివి అనేకం జరుగుతున్నాయని దీనివల్ల నష్టపోయేది ఎక్కువగా పనిచేసి బతికే కార్మికులేనని అన్నారు. సర్ పేరుతో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి వచ్చి ఫారం లు ఎప్పుడు ఇస్తారో తెలియక వారు పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డదని, దీనివల్ల ప్రజలకు ఆర్థిక భారమే కానీ ఎలాంటి ఉపయోగం లేదని, ఒకవేళ వారు ఫారంలో నింప లేక పోతే వారి ఓటు హక్కును తొలగించడం రానున్న రోజుల్లో ఓటు లేదనే కారణంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందని పరిస్థితి ఏర్పడుతుందని ఇదే బిజెపి యొక్క అసలు ఎజెండా అని అన్నారు. ధనవంతులు ఫారంలు సరిగ్గా నింపి ఓటు పొందితే కార్మికులు సరిగ్గా నింపలేరు కాబట్టి కార్మికులకు ఓట్లు తొలగించి ధనవంతులకు ఓట్లుంచి మళ్లీ పూర్వం రోజుల్లో ఉన్నవాడికే ఓటు, లేని వాడికి లేనట్టు తీసుకురావడమే బిజెపి, ఆర్ఎస్ఎస్ యొక్క ప్రధాన లక్ష్యమని,




ఇది తెలుసుకొని ప్రజలంతా ఓటును కాపాడుకోని రానున్న ఎన్నికల్లో అదే ఓటుతో బిజెపికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి కే.స్వామి, ఏఐటిసి కార్యదర్శి బి.శ్రీనివాస్, అధ్యక్షుడు హరినాథ్ రావు, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం నాయకులు వంశీ, కీర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది ఓటుతోనే భవిష్యత్తు మారుతుంది

రోడా మేస్త్రి డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ లో భారత ఎన్నికల సంగం ఓటరు సర్వే ఎస్ ఐ ఆర్ ను బి ఎల్ ఓ, బి ఎల్ ఏ తో నిర్వహిస్తున్న సందర్భంగా ఎస్ ఐ ఆర్ లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ఐ ఎన్ టి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మన రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జరుగుతుందని అంబేద్కర్ భారత రాజ్యాంగంలో ప్రతి భారత పౌరునికి ఓటు హక్కు కల్పించి ఓటు ద్వారా దృఢమైన రాజ్యాన్ని పరిపాలించుకోవాలని, భారత ప్రజాస్వామ్యం కాపాడుకోవాలని, భారత పౌరునికి ఓటు హక్కుకల్పించినారు యువత రాజకీయాల్లో రావాలని దేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 18 సంవత్సరాలకే యువతకు ఓటు హక్కు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ దే అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది బుల్లెట్ కన్నా బలమైనదని సమాజ మార్పు అభివృద్ధి ఓటు తోనే జరుగుతుందని ప్రతి ఒక్కరి పేరు లిస్టులో ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. పి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లు తో పాటు రాజకీయ పార్టీలు ఒక్క ఓటు కూడా అర్హులను తొలగించకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ ఐలయ్య స్వయంగా ఓటర్ నమోదు పారని బి ఎల్ ఎ కు అందించారు.

# కె.యం.ప్రతాప్ ని మర్యాదపూర్వకంగా కలిసి విమల పూరి కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని విమాన పురి కాలనీలో కాలనీవాసులు సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా జిట్టా బలవంత్ రెడ్డిని, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం వారు రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలను తెలియజేశారు. గతంలో కాలనీ అభివృద్ధికి సహకరించి నట్లే, తన వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు రవి హనుమంతరావు, పతాన్ పిల్లి, ప్రధాన కార్యదర్శి గోపీనాథం అజీష్ నాయర్, కోశాధికారి చిన్న రామయ్య, అరుణ్ కుమార్, సంయుక్త కార్య దర్శులు కృష్ణమోహన్, యాస్లీ ఫెర్నాండెజ్, శంకరా రావు, నిర్వాహక కార్యదర్శులు సాయి తేజ, మహేష్ గౌడ్, హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

**జిల్లా మొత్తం జనాభా 48,28,324 కాగా, సుమారు 14,46,993 గృహాలు ఉన్నాయ**

**జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు 5,31,328 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యం**

**1,203 పల్స్ పోలియో బూత్‌లు, 40 మొబైల్ బృందాలు, 31 ట్రాన్సిట్ పాయింట్లు, 32 కోల్డ్ చైన్ కేంద్రాలు ఏర్పాటు**

**9 మంది జిల్లా స్థాయి పర్యవేక్షణ అధికారులు, 120 మంది రూట్ సూపర్వైజర్లు నియమించబడ్డారు**




మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం2026 నిర్వహణకు అన్ని శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. సి.ఉమా గౌరి తెలిపారు. జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వారు వెల్లడించారు. నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలోని 0 నుండి 05 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 29, 30వ తేదీలలో ఇంటింటికీ వెళ్లి మొదటి రోజు బూత్‌లకు రాని చిన్నారులను గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా మొత్తం జనాభా 48,28,324 కాగా, సుమారు 14,46,993 గృహాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు 5,31,328 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇందులో 300 అధిక ప్రమాద, వలస, సంచార నివాస ప్రాంతాల్లో నివసిస్తున్న 10,717 మంది చిన్నారులకు ప్రత్యేక బృందాల ద్వారా సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం జిల్లాలో 1,203 పల్స్ పోలియో బూత్‌లు, 40 మొబైల్ బృందాలు, 31 ట్రాన్సిట్ పాయింట్లు, 32 కోల్డ్ చైన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజు కార్యక్రమం ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు నిర్వహించబడుతుందని వెల్లడించారు. మొదటి రోజు ప్రతి పోలియో బూత్‌లో నలుగురు సభ్యులతో కూడిన బృందాలు పనిచేస్తాయని, అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించే రెండో, మూడో రోజులలో ప్రతి బృందంలో ఇద్దరు సభ్యులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా మండళ్ల సభ్యులు, ఇతర వాలంటీర్లు తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు.అదే విధంగా జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు, కార్పొరేట్ ఆసుపత్రులు కూడా ఈ మహత్తర ప్రజారోగ్య కార్యక్రమంలో భాగస్వాములవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు 9 మంది జిల్లా స్థాయి పర్యవేక్షణ అధికారులు, 120 మంది రూట్ సూపర్వైజర్లు నియమించబడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలుకు 2,406 ఇంటింటి బృందాలు, 4,812 బూత్ వ్యాక్సినేటర్లు, 124 ట్రాన్సిట్ పాయింట్ వ్యాక్సినేటర్లు, 80 మొబైల్ టీమ్ వ్యాక్సినేటర్లు, 271 ఏఎన్ఎంలు, 1,260 ఆశా కార్యకర్తలు, 771 అంగన్‌వాడీ కార్యకర్తలు, 2,714 మంది వాలంటీర్లు కలిపి మొత్తం 5,016 మంది సిబ్బంది సేవలందించనున్నారని తెలిపారు. కార్యక్రమం కోసం 29,166 పోలియో వ్యాక్సిన్ వయల్స్ సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. జిల్లాలోని ప్రతి తల్లిదండ్రులు తమ 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి జూన్ 28న సమీపంలోని పల్స్ పోలియో బూత్‌లో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరి మరియు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కౌశిక్ విజ్ఞప్తి చేశారు. ఇంతకుముందు పలుమార్లు పోలియో చుక్కలు వేయించినప్పటికీ, ప్రతి జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో మరోసారి పోలియో చుక్కలు వేయించడం చిన్నారులను పోలియో వ్యాధి నుండి సంపూర్ణంగా రక్షించడానికి అత్యంత అవసరమని వారు తెలిపారు.

# సీఎం, డిప్యూటీ సీఎం, స్పోర్ట్స్ మినిస్టర్ ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన స్పోర్ట్స్ ఉద్యోగులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఉద్యోగుల సంక్షేమాన్ని ఉద్యోగుల భద్రతకు భరోసా ఇస్తూ ఉచిత ప్రమాద బీమా రక్షణను కల్పించడం పట్ల తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల తోపాటు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఒక రూపాయి అదనపు భారం లేకుండా ఉచిత ప్రమాద బీమా రక్షణ కల్పించడం పట్ల వారు సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎల్బీ స్టేడియం లో జరిగిన ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్ మాట్లాడుతూ ఉచిత ప్రమాద బీమా వల్ల ఉద్యోగుల కుటుంబాలకు మనో ధైర్యాన్ని ఇస్తుందని, ఈ పథకం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయడం వల్ల ఎందరో చిన్న ఉద్యోగులు వారి కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి వివిధ శాఖల్లో పని చేస్తూ రెగ్యులర్ కు నోచుకోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# బిఎల్ఓలు నిర్వహిస్తున్న సర్ ఓటు మ్యాపింగ్ ను పరిశీలించిన మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్



గాజులరామారం సర్కిల్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్ లో జరుగుతున్న సర్ రూట్ మ్యాప్ ఇన్ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో స్థానిక ఓటర్లు అందరూ భాగస్వాములు అవ్వాలని బిఎల్వోలు ఓటర్లకు అందజేసే ఎన్యూమరేషన్ దరఖాస్తులో తమ యొక్క పూర్తి వివరాలను నమోదు చేసుకొని ఓటు హక్కును పొందాలని, అదేవిధంగా రెండు చోట్ల ఉండే ఓటర్లను తొలగించే విధంగా బిఎల్ఓలు కృషి చేయాలని, అదేవిధంగా నకిలీ ఓట్లను సైతం పూర్తిగా డిలీట్ చేసే విధంగా చూడాలని స్థానిక బి ఎల్ ఓ లకు సూచించారు, నూతనంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరు ఈ సర్ కార్యక్రమంలో నూతనంగా ఓటు హక్కును పొందే అవకాశం కేంద్ర ఎన్నికల కమిషన్ కల్పించిందని స్థానిక నాయకులను ఉద్దేశించి మాట్లాడారు, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసి ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాకీర్ బలరాం, సిహెచ్ బుచ్చిరెడ్డి, పద్మ, సలీం, రజాక్, దుర్గేష్, కల్పన, నరసింహ, ఆబేద్, లక్ష్మి, సుజాత, లావణ్య, బిఎల్వోలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండు చుక్కలు..
# పిల్లల జీవితాలకు రక్షణ

**కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా.**

**తల్లిదండ్రులు పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలి**

**05 సంవత్సరాల పిల్లలు 5,04,803**

**2,800 పోలియో కేంద్రాలు, 38 ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు**

**పోలియో వ్యాక్సిన్ నాణ్యతను కాపాడేందుకు +2నుండి +8ఉష్ణోగ్రతల మధ్య భద్రపరచబడుతుంది**



జిల్లాలోని జాతీయ టీకాకరణ దినోత్సవం సందర్భంగా జూన్ 28వ తేదీన పల్స్ పోలియో టీకా కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా తెలిపారు. ఈ సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణలో 28వ సంవత్సరం. భారతదేశంలో చివరి పోలియో కేసు 13 జనవరి 2011న గుర్తించబడింది. అనంతరం 2012లో భారత్ పోలియో వ్యాధి ప్రబల దేశాల జాబితా నుండి తొలగించబడగా, 2014 మార్చి 27న ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి పోలియో రహిత దేశంగా ధృవీకరణ పత్రం పొందింది. తెలంగాణ రాష్ట్రంలో చివరి పోలియో కేసు 2007లో నల్గొండ జిల్లాలో అలాగే హైదరాబాద్ జిల్లాలో చివరి పోలియో కేసు 1998లో నమోదైంది. నేడు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో 05 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచితంగా పోలియో చుక్కలు అందించడం జరుగుతుందని పిల్లల తల్లిదండ్రులు కేంద్రాలలో పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**ఇంటింటి సర్వే ద్వారా..** 29-06-2026 నుండి 01-07-2026 వరకుపోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయబడతాయి. 05 సంవత్సరాల పిల్లలు 5,04,803 మంది కలరని, 2,800 పోలియో బూత్‌లు, 38 ట్రాన్సిట్ బూత్‌లు (రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, మెట్రో స్టేషన్లు తదితర ప్రాంతాల్లో) 91 మొబైల్ బృందాలు- 193 అధిక ప్రమాద ప్రాంతాలు ప్రత్యేకంగా గుర్తించడం జరిగిందని తెలిపారు.

అలాగే నిర్మాణ ప్రదేశాలు, వలస కూలీల కాలనీలు, సంచార జాతులు, బిచ్చగాళ్ల నివాస ప్రాంతాలు, మార్కెట్లు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, ఉద్యానవనాలు తదితర ప్రాంతాలలో ప్రత్యేక బృందాలు సేవలందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు అలాగే ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది మొత్తం 11,500 మందికి పైగా ఈ కార్యక్రమ నిర్వహణకు నియమించడం జరిగిందని పేర్కొన్నారు. పోలియో వ్యాక్సిన్ నాణ్యతను కాపాడేందుకు +2ఫీజ నుండి +8ఫీజ ఉష్ణోగ్రతల మధ్య భద్రపరచబడుతుంది. ఇందుకోసం జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో డీప్ ఫ్రీజర్లు, కోల్డ్ బాక్స్‌లు, వ్యాక్సిన్ క్యారియర్లు, ఐస్ ప్యాక్‌లు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి, గతంలో ఎన్ని సార్లు పోలియో చుక్కలు వేసినా సరే, నేడు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించండి. పోలియో రహిత నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు.

## కూకట్ పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న సర్ ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్ మను చౌదరి



ఓటర్ల జాబిత ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా శనివారం కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న సర్ ప్రక్రియను జోనల్ కమీషనర్ మయాంక్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. హౌజింగ్ బోర్డు తిరుమ హిల్స్ లో బిఎల్ఓ లు ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అదేవిధంగా ప్రతిరోజు ఉదయం బిఎల్ఓల అటెండెన్సును తెలుసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇచ్చారని, ఒక్కొక్కరికి ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇస్తున్నారని, ఎన్రోల్ మెంట్ యాప్ ద్వారా ఆప్ లోడ్ చేసే ప్రక్రియను బిఎల్ఓ ను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని, సెల్ ఫోన్ లో క్యూఆర్ కోడ్ ద్వారా అప్ లోడ్ చేస్తున్నామని బిఎల్ ఓలు వివరించారు. పత్రాలు ఇచ్చిన తరువాత తప్పనిసరిగా యాప్ లో అప్ లోడ్ చేయాలని తెలిపారు. మ్యాపింగ్ కాని వారి వివరాలను బిఎల్ఎ తో సమన్వయం చేసుకుంటూ ఎన్యూమరేషన్ ఫామ్స్ అందించాలని సూచించారు. ఈ పర్యటనలో కూకట్ పల్లి తహాసీల్దారు అశోక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 10న ఆర్ బివిఆర్ఆర్ మహిళా కళాశాల స్నాతకోత్సవం




రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 15వ స్నాతకోత్సవం జూలై 10వ తేదీన నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె.అచ్యుతదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.మంజుల, వైస్ ప్రిన్సిపల్ సిందూరిలతో కలిసి ప్రిన్సిపాల్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన 302 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ను అందజేయనున్నట్లు తెలిపారు. చదువులో అత్యుత్తమంగా రాణించిన 17 మంది విద్యార్థినీలకు స్వర్ణ పతకాలను అందించనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవ వేడుకలకు మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి.సుమతి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ఓయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రధానం చేస్తారని తెలిపారు.

## దివ్యాంగులకు త్వరలో ఇంటర్ తరగతులు ప్రారంభం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**శరీరానికి పరిమితులు ఉండొచ్చు... సంకల్పానికి ఎలాంటి పరిమితులు ఉండవు**

**హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగుల సాధికారతకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**దివ్యాంగులు జాలి కోరేవారు కాదు... అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించే ప్రతిభావంతులు**

**హెలెన్ కెల్లర్ 146వ జయంతి వేడుకల్లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

వైకల్యం విజయానికి అడ్డంకి కాదు ఆత్మవిశ్వాసం లేకపోవడమే అసలైన అడ్డంకి. శరీరానికి పరిమితులు ఉండొచ్చు కానీ సంకల్పానికి ఎలాంటి పరిమితులు ఉండవు అని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రపంచానికి పట్టుదల, ఆత్మవిశ్వాసం, అచంచల సంకల్పానికి ప్రతీకగా నిలిచిన హెలెన్ కెల్లర్ 146వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ జీవితం ప్రపంచానికి శాశ్వత స్ఫూర్తి అని పేర్కొన్నారు. కేవలం 19 నెలల వయసులో చూపు, వినికిడి రెండింటినీ కోల్పోయినా ఆమె తన సంకల్పబలంతో ప్రపంచ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. తన గురువు ఆన్ సలివన్ మార్గదర్శకత్వంలో స్పర్శ ద్వారా విద్యను అభ్యసించి, దృష్టి-శ్రవణ వైకల్యం ఉన్న తొలి డిగ్రీధారిణిగా చరిత్ర సృష్టించడమే కాకుండా రచయిత్రిగా, వక్తగా, సామాజిక సేవకురాలిగా కోట్లాది మంది దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. ఆమె చీకటిలో జీవించింది కానీ ప్రపంచానికి వెలుగు చూపించింది. హెలెన్ కెల్లర్ ఒక వ్యక్తి కాదు పట్టుదల అనే పదానికి ప్రత్యక్ష రూపం అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా దివ్యంగా విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, దివ్యాంగుల శాఖ సంచాలకురాలు శైలజ, కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ప్రభంజన్, వివిధ దివ్యాంగ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు



మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం అరుణ శ్రీనివాస్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. ఈ ప్రదర్శనలో గణపతి గీతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, శివాష్టకం, కోలాటం, పలుకు తేనెల తల్లి, హనుమాన్ చాలీసా, వందన, జయ జనార్ధన, కస్తూరి తిలకం, గరుడ గమన, తిల్లాన అంశాలను కళాకారులూ సరయు, సంహిత, నిధిమా, గ్గానా, జోషిత, కైవల్య, వైష్ణవి, అశ్వి, రుచిక, విభా మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. ఉదయం సుచేత ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు పెయింటింగ్ ఎక్సిహిబిషన్ నిర్వహించారు. దాదాపుగా వందమంది విద్యార్థులు వాలా పెయింటింగ్స్ ప్రదర్శన, అమ్మకం నిర్వహించారు. పాల్గొన్న అందరికి ప్రశంస పత్రాలతొ సత్కరించారు. అనంతరం యశ్వంత్ దీక్షిత్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. శ్రీ గణపతిమ్ సేవింపరారే, వినాయక కౌతం, జతిస్వరం, బ్రహ్మాంజలి, జనుత శబ్దం, స్వాగతమ్ కృష్ణ, రామాయణ శబ్దం, గరుడ గమన, హనుమాన్ చాలీసా, తిల్లాన, తరంగం, అష్టలక్ష్మీస్తోత్రం అంశాలను కళాకారులూ శ్రీనిక, అనయశ్రీ, రిషిత, హాన్విక, నిషిక, హాసవిత, ఆరాధ్య, మనోజ్ఞ ,సమీక్షా, మనస్విని,అమూల్య, యశస్వి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



## ఖైదీలు న్యాయపరమైన సేవలపై అవగాహన కలిగి ఉండాలి : పి.అరుణ కుమారి





న్యాయ సేవా సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్ కార్యదర్శి పి.అరుణ కుమారి హైదరాబాద్ లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారంతో పాటు మహిళా కేంద్ర కారాగారాన్ని సందర్శించి ఖైదీల సంక్షేమం, వారికి అందుతున్న న్యాయ సేవలు, ఉచిత న్యాయ సహాయ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పురుష, మహిళా ఖైదీలతో విడివిడిగా సమావేశమై వారి సమస్యలు, న్యాయపరమైన సందేహాలు, పెండింగ్‌లో ఉన్న కేసులు, అప్పీలు, బెయిల్ దరఖాస్తులు, విడుదలకు సంబంధించిన అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఖైదీకి జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా సత్వరమే ఉచిత న్యాయ సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు. అలాగే ఖైదీలకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ ద్వారా న్యాయ సహాయాన్ని మరింత సమర్థవంతంగా అందించడం, న్యాయ సహాయం కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడం, న్యాయ అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. కారాగారాల్లో ఖైదీలకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, విద్యా మరియు వృత్తి నైపుణ్య శిక్షణ, పునరావాస కార్యక్రమాలు, మహిళా ఖైదీల సంక్షేమం అలాగే వారి హక్కుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

జాతీయ న్యాయ సేవా సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ మార్గదర్శకాల మేరకు అర్హులైన ప్రతి ఖైదీకి నాణ్యమైన ఉచిత న్యాయ సహాయం అందించడం జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రధాన లక్ష్యమని కార్యదర్శి ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో చంచల్‌గూడ కేంద్ర కారాగార జైలర్ గణేష్, మహిళా కేంద్ర కారాగార డీఎస్పీ అమరావతి, కారాగార శాఖ అధికారులు, సిబ్బంది, జిల్లా న్యాయ సేవా సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలపై పన్నుల భారం..

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను కేవలం పన్నులు వసూలు చేసే వనరులుగానే పరిగణిస్తోందని ఆయన ఆరోపించారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నేపథ్యంలో ముడి చమురు బ్యారెల్ ధర 138 డాలర్లకు చేరినప్పుడు, దేశంలో లీటర్ పెట్రోల్ ధర సుమారు రూ. 94.77గా ఉండేదని ఖర్గే గుర్తుచేశారు. ప్రస్తుతం క్రూడ్ ధర 70 నుంచి 82 డాలర్ల మధ్య ఉన్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్ ధర రూ. 101 - 111, డీజిల్ ధర రూ. 95 - 100 మధ్య కొనసాగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నంది పత్రిక
ఆదివారం 28 - 06 -2026

# జూన్ 28న పల్స్ పోలియో

## కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**-ప్రతి 5 సంవత్సరాల చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో చుక్కలు వేయించండి..**
**-జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు**



భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 28 నుండి 30, 2026 వరకు జిల్లాలో ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు తెలిపారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి రెండు చుక్కల బైవేలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వల్ల 2011 సంవత్సరం నుండి జిల్లాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని ఈ విజయాన్ని కొనసాగించేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం కోసం 950 పోలియో బూత్‌లు 30 మొబైల్ బృందాలు 30 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో పాటు 4,375 మంది సిబ్బంది 108 మంది పర్యవేక్షకులు మరియు 120 వాహనాలు వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 1,31,642 మంది 0--5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అవసరమైన 1,44,000 డోసులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.జూన్ 28 (ఆదివారం) నాడు సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు ప్రతి తల్లిదండ్రులు తమ 0--5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని ఆ రోజు బూత్‌కు రాలేని పిల్లలకు జూన్ 29 మరియు 30 తేదీలలో ఇంటింటికి వెళ్లే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయబడతాయని తెలిపారు.పిల్లలు ఇప్పటికే అన్ని టీకాలు తీసుకున్నా ఆరోగ్యంగా ఉన్నా గతంలో పల్స్ పోలియో చుక్కలు వేయించుకున్నా కూడా ఈసారి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించాలని డిఎంహెచ్ఓ డా. డి రామారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రతి చిన్నారికి రెండు చుక్కలు -- పోలియో రహిత సమాజమే మన లక్ష్యం అని పేర్కొంటూ ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు గ్రామ పెద్దలు ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ సిబ్బంది మరియు ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అసలు నిందితులు దొరికినా..మాపై పడిన నింద మాత్రం పోలేదు

**-నల్లగొండ నాలుగు హత్యల కేసులో మాపై ఆరోపణలు**
**-ఒకవైపు తల్లిని కోల్పోయి, మరోవైపు నిందలతో బాధగా ఉంది**
**-జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బుష్రా,అర్షన్**



నాలుగు హత్యల కేసులో అసలు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఊపిరి పీల్చుకున్న బుష్రా,అర్షన్..తమను నిర్దోషులుగా నిర్ధారించిన జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.అయితే, ఆధారాలు లేకుండానే తమ ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ హంతకులుగా ప్రచారం చేయడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు."ప్రేమించి పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో ప్రశాంతంగా జీవిస్తున్నాం.కానీ, చేయని నేరానికి మమ్మల్ని దోషులుగా చిత్రీకరించారు.అసలు నిందితులు దొరికినా ఇప్పటికీ చాలామంది మమ్మల్నే అనుమానంతో చూస్తున్నారు.మా పరువు,మా జీవితం తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని కన్నీటి పర్యంతమయ్యారు."మా తల్లిని కోల్పోయిన బాధ ఒకవైపు..చేయని నేరానికి మమ్మల్ని నిందించిన బాధ మరోవైపు వెంటాడుతోంది" అని బుష్రా భావోద్వేగానికి లోనయ్యారు. సోషల్ మీడియా,యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర వేదికల్లో తమ ఫోటోలతో ఉన్న తప్పుడు పోస్టులను వెంటనే తొలగించాలని కోరారు.వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరినీ నిందితులుగా ప్రచారం చేయవద్దని మీడియా,సోషల్ మీడియా వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. మీడియా అత్యుత్సాహంపై విమర్శలు ఈ ఘటన మరోసారి నిజాలు వెలుగులోకి రాకముందే కొంతమంది మీడియా సంస్థలు,సోషల్ మీడియా వేదికలు తీర్పులు చెప్పే ధోరణి ఎంత ప్రమాదకరమో గుర్తు చేసింది.

అధికారిక దర్యాప్తు పూర్తి కాకముందే వ్యక్తుల ఫోటోలు,పేర్లను ప్రచారం చేయడం వల్ల నిర్దోషుల పరువు,వ్యక్తిగత జీవితం,

కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఈ సంఘటన స్పష్టం చేసింది.వార్తల్లో వేగం ఎంత ముఖ్యమో,వాస్తవ నిర్ధారణ కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

# రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

ఖమ్మం జిల్లాలో అవినీతిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. ముదిగొండ మండలం భానాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేష్ రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, భవన నిర్మాణ అనుమతి (బిల్డింగ్ పర్మిషన్) మంజూరు చేయడంతో పాటు ఇంటి నంబర్ కేటాయించేందుకు ఫిర్యాదుదారుని నుంచి రూ.25,000 లంచం డిమాండ్ చేశాడు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో ఖమ్మం రేంజ్ ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని, ముదిగొండ మండలంలోని రితు వేదిక సమీపంలో లంచం స్వీకరిస్తున్న సమయంలో



కార్యదర్శిని పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.25 వేల లంచం నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, అతడిని అరెస్టు చేసి వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది. అధికారులు ఎవరైనా ప్రజా సేవల కోసం లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ప్రజలకు సూచించారు..

# ఇందిరమ్మ ఇళ్లు స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

తెలంగాణలో ఇంరమ్మ ఇళ్ల నిర్మాణం వ్యయం లబ్ధిదారులకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుం. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసిం. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో అప్పుల పాలు కాకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఇకపై ఇంరమ్మ ఇళ్ల స్లాబ్‌ను 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. స్లాబ్ ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ముందువైపు మూడు అడుగులు, మిగతా మూడు వైపులా ఒక్క అడుగుకు మించరాదని స్పష్టం చేశారు. కొత్తగా చేపట్టే నిర్మాణాలతో పాటు, ప్రస్తుతం బేస్‌మెంట్ లేదా రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు కూడా ఈ




నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. చాలామం లబ్ధిదారులు అవసరానికి మించి పెద్ద సైజులో స్లాబులు వేస్తుండటంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరుగుతోందని గృహ నిర్మాణ సంస్థ గుర్తించిం. గోడల నుంచి ఎనిమి అడుగుల వరకు కూడా స్లాబులను పొడిగిస్తున్న సందర్భాలు ఉన్నాయని, దీనివల్ల పేద లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోతోందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ పరిమితులు ధించిం.ఎండ, వానల నుంచి రక్షణ కోసం భారీ ఆర్‌సీసీ స్లాబులకు బదులుగా కిటికీలు, తలుపులపై సన్‌షేడ్లు, టైల్డ్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిం. ఇందిరమ్మ పథకం కింద అర్హులైన పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సాయం దుర్వినియోగం కాకుండా, లబ్ధిదారులకు భారం కలగకుండా గృహ నిర్మాణం పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంని ప్రభుత్వం ఆదేశించింది.

# నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లతో

## తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్







తప్పు నంబర్ ప్లేట్లు, నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కఠిన చర్యలు ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం వన్‌టౌన్ కార్నర్ వద్ద చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, తప్పుగా అమర్చిన నంబర్ ప్లేట్లు, అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 115 వాహనాలను సీజ్ చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం సంబంధిత నిబంధనల మేరకు జరిమానాలు విధించడంతో పాటు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి మాట్లాడుతూ, ప్రతి వాహనానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా స్పష్టంగా కనిపించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఉండాలని తెలిపారు. నంబర్ ప్లేట్లను మార్చడం, స్టిక్కర్లు లేదా ఇతర డిజైన్లతో నంబర్లు కనిపించకుండా చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి నిబంధనల

ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్యతో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శని త్రయోదశి వేళ భీమేశ్వరుడిని దర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయానికి విచ్చేసిన ప్రభుత్వ విప్‌కు అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు.శని త్రయోదశి సందర్భంగా ఆలయంలోని నవగ్రహ మండపంలో శనీశ్వర స్వామివారికి నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించారు. నల్ల వస్త్రం సమర్పించి, నవధాన్యాలతో ప్రత్యేక అర్చనలు చేశారు. శని దోష



నివారణ కోసం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వామివారి తీర్థప్రసాదం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందించి వేదాశీర్వచనాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈఓలు జి. శ్రావణ్ కుమార్, జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నూగూరి నరేందర్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com